ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



పెద్దపల్లి

జిల్లా వార్తలు

1★

ఆదివారం 4 మే 2025

న్యూస్ బాక్స్

కలెక్టర్‌ను కలిసే వేళలో స్వల్ప మార్పులు

పెద్దపల్లి, మే 3 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో వివిధ సమస్యలపై ప్రజలు తనను నేరుగా కలిసే సందర్శన వేళల్లో స్వల్ప మార్పు చేశామని కలెక్టర్ కోయ శ్రీహర్ష శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం నుంచి శుక్రవారం వరకు కార్యాలయ పని దినాలలో కలెక్టరేట్‌లో మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉంటానని, వివిధ సమస్యలు, పనులు ఉన్న సందర్శకులు, ఫిర్యాదుదారులు ఆ సమయంలో నేరుగా తనను కలవచ్చని కలెక్టర్ తెలిపారు. మిగిలిన సమయాల్లో వచ్చి వేచి ఉండి సమయాన్ని వృథా చేసుకోవద్దని కలెక్టర్ పేర్కొన్నారు.

ప్రభుత్వ భూమి పంపిణీకి కమిషనర్ ఆదేశం

ఓదెల, మే 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మడకలో సర్వే నెంబర్లు 510, 556, 492లోని ప్రభుత్వ భూమిని గ్రామ సభ నిర్వహించి నిరుపేదలకు పంపిణీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ల్యాండ్ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు కలెక్టర్‌తోపాటు తహసీల్దార్‌కు ఆదేశాలు అందాయి. మడకలోని ప్రభుత్వ భూమిని కొందరు ఆక్రమించుకొని సాగు చేస్తున్నారనే నెపంతో ఇదే గ్రామానికి చెందిన గోషిక రాజేశం గతంలో హైదరాబాద్‌లోని ల్యాండ్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. అనంతరం అప్పటి తహసీల్దార్ యాకయ్య నేతృత్వంలో ఆక్రమిత భూములను సర్వే చేయించారు. ఇందులో 10 ఎకరాల మేరకు ప్రభుత్వం భూమి ఆక్రమణకు గురైనట్లు నిర్ధారించారు. దీంతో అధికారులు ఇచ్చిన సర్వే నివేదికల మేరకు ఆక్రమించిన 10 ఎకరాల భూమిని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఉన్నతాధికారులకు నివేదికలు సమర్పించగా రాష్ట్ర ల్యాండ్ కమిషనర్ ఆదేశాలిస్తూ, గ్రామసభలను నిర్వహించి ఎలాంటి భూమిలేని నిరుపేదలకు పంపిణీ చేయాలని ఆదేశాలు జారీ చేశారు.

బాలుడి ప్రాణం మీదికి తెచ్చిన కోడిగుడ్డు

- యేడాది బాలుడి గొంతులో ఇరుక్కున గుడ్డు
- ప్రాణాలు కాపాడిన 108 టెక్నీషియన్ 2

- వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో వినూత్న కార్యక్రమం
- రేపటి నుంచి ప్రారంభం
- రైతులకు అవగాహన కల్పించనున్న శాస్త్రవేత్తలు
- వచ్చే సీజన్ నుంచి గ్రామాల్లోనే విత్తనోత్పత్తి దిశగా సన్నాహాలు



రైతు ముంగిటకు శాస్త్రవేత్తలు

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

రైతులకు పలు అంశాలపై అవగాహన కల్పించేందుకు ప్రొఫెసర్ జయ శంకర్ యూనివర్సిటీ, వ్యవ సాయ శాఖ ఆధ్వర్యంలో రైతుల ముంగిటకు శాస్త్ర వేత్తలు కార్యక్రమానికి శ్రీకారం చుడు తోంది. ఈ నెల 5 నుంచి జూన్ 13 వర కు రాష్ట్ర వ్యాప్తంగా ఆరు వారాల పాటు కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. అం దులో భాగంగా పెద్దపల్లి జిల్లాలో 5 నుంచి జూన్ 11 వరకు ఆరు గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పిం చనున్నారు. రాష్ట్రంలోని 415 మంది శాస్త్రవేత్తలు, 200 గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించనున్నారు. ఈ క్రమంలోనే జిల్లాలోని నాలుగు మండలాల్లోని ఆరు గ్రామాల్లో ఎంపిక చేశారు. ఈ గ్రామాల్లో రైతులకు సాగు మెళకువలు, విత్తనోత్పత్తి, సస్యరక్షణ చర్యలు, నీటి యాజమాన్యం, తదితర అంశాలపై అవగాహన కల్పించనున్నారు.

విత్తనోత్పత్తికి ప్రణాళిక

గ్రామాల్లోనే నాణ్యమైన విత్తనాలను తయారు చేయాలనే సంకల్పంతో ప్రొఫెసర్ జయశంకర్ విశ్వ విద్యాలయం ఆధ్వర్యంలో ప్రభుత్వ సహకారంతో ప్రత్యేక ప్రణాళికను సిద్ధం చేశారు. ఈ యాసంగి లేదా వచ్చే వానాకాలం సీజన్‌లో ఈ ప్రణాళికను ఆచరణలో పెట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. గ్రామానికి ఐదుగురు రైతుల చొప్పున ఎంపిక చేసి వారికి యూని వర్సిటీ ఆధ్వర్యంలో రీసెర్ఛ్ చేసిన వంగడాలను అంద జేసి గ్రామస్థాయిలో నాణ్యమైన విత్తనాలను తయారు చేసేందుకు కసరత్తు చేస్తున్నారు. ఇప్పటికే జిల్లా వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఆసక్తి గల రైతుల జాబి తాను రూపొందిస్తున్నారు. ఈ రైతులకు వరి, మొక్క జొన్న, పత్తి వంగడాలను అందజేసి విత్తనోత్పత్తిని గ్రామాల్లోనే చేసి రైతులపై విత్తన భారం పడకుండా చూసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

విత్తన ఎంపికపై అవగాహన

రైతులకు ముఖ్యంగా విత్తన ఎంపిక కీలకమని గుర్తించడం, విత్తనం తీసుకున్న వెంటనే రసీదును తీసుకోవాలని తద్వారా కలిగే ప్రయోజనాలను వివరించనున్నారు. పంట మార్పిడి వైపు ప్రోత్సహిస్తారు. పత్తి, వరి కొయ్యలు కాల్చడంతో కలిగే నష్టాలు, అధి కంగా యూరియా(నత్రజని) వాడకంతో కలిగే దుష్ప్ర భావాలను తెలపనున్నారు. వేసవి దుక్కులు, పచ్చిరొట్టె విత్తన సాగుతో కలిగే ప్రయోజనాలు, నూతన వంగ డాలు, రకాలపై శిక్షణ ఇవ్వనున్నారు. సంబంధించిన అంశాలపై శాస్త్రవేత్తలు గ్రామ స్థాయిలో రైతులకు అవగాహన కల్పించనున్నారు.

(మిగతా 4వ పేజీలో)

రెవెన్యూ సదస్సుల పైలట్ ప్రాజెక్ట్‌గా ఎలిగేడు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లి, మే 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశాల మేరకు పైలట్ ప్రాజెక్టు కింద ఎలిగేడు మండలంలో భూ భారతి రెవెన్యూ సదస్సులు ఈనెల 5 నుంచి 19 వరకు నిర్వహిస్తామని కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లో ఎలిగేడు మండలంలో రెవెన్యూ సదస్సుల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎలిగేడు మండలంలో పైలట్ ప్రాజెక్టు కింద భూభారతి సదస్సులు నిర్వహించి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించాలని ఆదేశించిందని పేర్కొన్నారు. అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రెవెన్యూ సదస్సుల నిర్వహణకు ప్రత్యేక అధికారిగా పర్యవేక్షిస్తారని తెలిపారు. జిల్లాలో 3 బృందాలను ఏర్పాటు చేసి ప్రతి గ్రామ పంచాయతీలో 2 రోజులపాటు రెవెన్యూ సదస్సు జరిగేలా షెడ్యూల్ రూపొందించామన్నారు.

ఎలిగేడు తహసీల్దార్ ఎండీ బషీరుద్దీన్ ఆధ్వర్యంలోని బృందం 5, 6 తేదీల్లో ఎలిగేడులో, 7, 8 తేదీల్లో లాలపల్లిలో, 9, 12 నారాయణపల్లిలో, 13, 14 తేదీల్లో శివపల్లిలో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తారని తెలిపారు. కలెక్టరేట్ సూపరింటెండెంట్ యాకన్న ఆధ్వర్యంలో బుర్హాన్‌మియాపేట, నర్సాపూర్, సుల్తాన్‌పూర్, లోకపేటలో, కలెక్టరేట్ నాయబ్ తహసీల్దార్ ధీరజ్‌కుమార్ ఆధ్వర్యంలో ధూళికట్టలో, ర్యాకల్‌దేవ్‌పల్లి, రాములపల్లి, 17, 19 తేదీల్లో ముప్పిరితోటలో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తారని తెలిపారు. భూ సమస్యల పరిష్కారంపై సదస్సులు నిర్వహించి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామని, భూ సమస్యలు ఉన్నవారు రెవెన్యూ సదస్సులో పాల్గొని దరఖాస్తులు సమర్పించాలని కలెక్టర్ తెలిపారు. ఆర్‌డీఓ బీ గంగయ్య, సర్వే ల్యాండ్ రికార్డ్స్ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్, ఎలిగేడు తహసీల్దార్ బషీరుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ప్రతీ రైతుకు విశిష్ట సంఖ్య కేటాయింపు

పెద్దపల్లి, మే 3 (ఆంధ్రజ్యోతి): ఆధార్‌తో ప్రతి పౌరుడికి గుర్తింపు ఉన్నట్లుగానే ప్రతీ రైతుకు 11 నెంబర్లతో విశిష్ట సంఖ్య (యూనిక్ కోడ్)ను ఈనెల 5వ తేదీ నుంచి కేటాయించ నున్నామని జిల్లా వ్యవసాయ శాఖాధికారి దోమ ఆదిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని డిజిటలైజ్ చేయాలనే సంకల్పంతో ఈ ప్రాజెక్టును చేపట్టారన్నారు. భూమి ఉన్న ప్రతీ రైతు భూములకు సంబంధించిన వివరాలతో కూడిన సమాచారంతో ఈ ఫార్మర్ రిజిస్ట్రీ నిర్వహిస్తున్నామన్నారు. రెవెన్యూ శాఖ ద్వారా సేకరించిన భూ యాజమాన్య వివరాలను రైతు ఆధార్ సంఖ్యను అనుసంధానం చేయడం ద్వారా ఈ ఫార్మర్ ఐడిని కేటాయించనున్నామని పేర్కొన్నారు. రెవెన్యూ శాఖ వద్ద ఉన్న భూ యజమాన్య వివరాలను ప్రామాణికంగా తీసుకొని రైతులకు ఐడి కేటాయిస్తామన్నారు. ఈ నెల 5 నుంచి ప్రతి క్లస్టర్‌లో ఫార్మర్ రిజిస్ట్రీ చేస్తారని, రైతులు వ్యవసాయ అధికారి, ఏఈవోను సంప్రదించాలని ఆదిరెడ్డి కోరారు.

జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న న్యాయమూర్తి శ్రీనివాసరావు

కోల్‌సిటీ, మే 3(ఆంధ్రజ్యోతి): రాజీ మార్గమే రాజ మార్గమని, జూన్ 14న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని జిల్లా అదనపు న్యాయమూర్తి టీ శ్రీనివాసరావు కోరారు. శనివారం జిల్లా న్యాయస్థానం ఆవరణలో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన లోక్ అదాలత్ సన్నాహక సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. లోక్ అదాలత్‌లో రాజీకాగల నేరాలు, గృహ హింస, వరకట్న కేసుల్లో రాజీ కుదుర్చుకోవాలన్నారు. ఆ దిశగా స్టేషన్ల వారీగా కేసులను గుర్తించి కౌన్సెలింగ్ నిర్వహించాలని సూచించారు. గోదావరిఖని సబ్ డివిజన్ పరిధిలోని కేసులను రాజీ చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. న్యాయమూర్తులు సూరజ్‌సింగ్, వెంకటసచిన్‌రెడ్డి, గురువ వెంకటేష్, స్వరిక, ఏజీపీలు శంతన్ కుమార్, కిషన్‌రావు, సౌజన్య, ఏపీపీ పర్వీన్, ఏసీపీ మడత రమేష్, సీఐలు ఇంద్రసేనారెడ్డి, ప్రసాద్‌రావు, ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయండి



డీజీఎం(పర్సనల్) కిరణ్‌బాబుకు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

గోదావరిఖని, మే 3 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ ఆర్‌జీ-1 బ్రాంచ్ అధ్యక్షుడు రాజమౌళి పిలుపునిచ్చారు. సింగరేణిలో ఈ నెల 20న సమ్మె చేయనున్నట్టు శనివారం ఆర్‌జీ-1 డీజీఎం (పర్సనల్) కిరణ్‌బాబుకు వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ బొగ్గు పరిశ్రమను ప్రైవేటీకరణ, కాంట్రాక్టీకరణ చేయవద్దని, నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కమర్షియల్ మైనింగ్ రద్దు చేసి ప్రభుత్వ ఆధ్వర్యంలోనే నడుపాలని, పెట్టుబడుల ఉపసంహరణ ప్రక్రియ రద్దు చేయాలని గ్రాట్యూటీ రూ.20లక్షలను 2015 నుంచి వర్తింప చేయాలని, కాంట్రాక్టు కార్మికులకు హై పవర్ కమిటీ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. మహేష్, నరహరిరావు, శంకర్, నారాయణ, శశికుమార్, కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

నాణ్యమైన ధాన్యాన్ని సత్వరమే కొనుగోలు చేయాలి



కుర్మపల్లి కొనుగోలు కేంద్రంలో కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లి రూరల్, మే 3 (ఆంధ్రజ్యోతి): కొనుగోలు కేంద్రాలకు వచ్చే నాణ్యమైన ధాన్యాన్ని సత్వరమే కొనుగోలు చేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష పేర్కొన్నారు. శనివారం మండలంలోని అప్పన్నపేట, అందుగులపల్లి, కుర్మపల్లి గ్రామాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా నాణ్యమైన ధాన్యం కొనుగోలు ప్రక్రియ జరగాలన్నారు. కొనుగోలు చేసిన ధాన్యానికి వెంటనే చెల్లింపులు పూర్తి చేయాలన్నారు. కొనుగోలు కేంద్రాలలో ప్యాడీ క్లీనర్ ఏర్పాటు చేయాలని, ధాన్యాన్ని శుభ్రం చేసిన తర్వాత తేమ శాతం రాగానే కొనుగోలు చేయాలన్నారు. ధాన్యం తరలింపునకు అవసరమైన వాహనాలు, హమాలీలను అందుబాటులో ఉంచుకోవాలని కలెక్టర్ తెలిపారు. అకాల వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని, కొనుగోలు కేంద్రాల వద్ద వర్షం కురిస్తే టార్పాలిన్ కవర్లతో ధాన్యం తడవకుండా జాగ్రత్త వహించాలని సూచిం చారు. కొనుగోలు కేంద్రాల వద్ద అవసరమైన వసతులు కల్పించాలని, ప్యాడీ క్లీనర్, టార్పాలిన్ కవర్లు, వెయింగ్, తేమ యంత్రాలు అందుబాటులో ఉండాలన్నారు. అప్పన్నపేట సింగిల్ విండో సీఈవో తిరుపతి పాల్గొన్నారు.

పాలకుర్తి, (ఆంధ్రజ్యోతి): కొనుగోలు కేం ద్రంలో ప్యాడీ క్లీనర్లు తప్పని సరిగా ఏర్పాటు చేయాలని, కొనుగోలు కేంద్రాల వద్ద రవాణా వాహనాలు హమాలీల కొరత రాకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష నిర్వాహకులకు సూచించారు. శనివారం బసంత్‌నగర్, కుర్మపల్లి కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేశారు. తహసీల్దార్ ముద్దమళ్ల జ్యోతి తదితరులున్నారు.

సంక్షేమ పథకాల సర్వే సక్రమంగా పూర్తిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయరమణారావు

పెద్దపల్లి టౌన్, మే 3 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ పథకాల సర్వే సక్రమంగా పూర్తి చేయాలని, మున్సిపల్ సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు సూచించారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలో సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. పట్టణంలోని అన్ని వార్డుల ఆఫీసర్లతో వార్డుల స్థితిగతులను తెలుసుకున్నారు. ప్రతీ వార్డులో మంచినీటి సమస్య, శానిటేషన్, అభివృద్ధి పనులను ప్రగతిపై సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న రాజీవ్ యువ వికాసం, ఇందిరమ్మ ఇల్లు, రేషన్ కార్డులు అనేక సంక్షేమ పథకాల సర్వే సక్రమంగా పూర్తి చేసి ప్రతీ నిరుపేద లబ్ధిదారుడికి అందే విధంగా చూడాలన్నారు. అలాగే వేసవికాలం దృష్ట్యా ప్రతీ ఇంటికి తాగు నీరు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు పెద్దపల్లి పట్టణ అభివృద్ధికి టీఎఫ్ఐడీసీ నిధుల ద్వారా 30 కోట్ల రూపాయలు తీసుకువచ్చామన్నారు. ప్రతీ వార్డులో సీసీ రోడ్లు, మురికి కాలువల నిర్మాణం, అమృత్ పథకంలో రూ.25 కోట్లతో మూడు ట్యాంకులు, పైపులైన్ నిర్మాణం, డీఎంఎఫ్‌టీ నిధులు రూ.3 కోట్లతో చందపల్లి, రాం పల్లి వద్ద డబుల్ బెడ్ రూంల వద్ద అభివృద్ధి పనులు పూర్తి చేస్తున్నామని వివరించారు. మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్, వ్యవ సాయ మార్కెట్ చైర్‌పర్సన్ ఈర్ల స్వరూప, ఏఈ సతీష్, టౌన్ ప్లానింగ్ అధికారి వార్డు ఆఫీసర్లు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

అస్తవ్యస్తంగా నీటి సరఫరా

- తరుచూ పైప్‌లైన్ల లీకేజీలు
- పాత పైపులైన్లు, ఆ పై రోడ్డు పనులు
- తాగునీటికి ఇబ్బంది పడుతున్న ప్రజలు
- శాశ్వత పరిష్కారం చూపడంలో నిర్లక్ష్యం



సుల్తానాబాద్‌లో దెబ్బతిన్న పైపులైన్

సుల్తానాబాద్, మే 3 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ మున్సిపాలిటీ పరిధిలో మంచినీటి సరఫరా అస్తవ్యస్తంగా మారింది. నీటి సరఫరా చేసే పైప్‌లైన్లు ఎక్కడో ఓ చోట దెబ్బతినడంతో అన్ని వార్డుల్లో నీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రోజుల తరబడి నీటి కోసం ఎదురు చూసే పరిస్థితి నెలకొంది. పట్టణంలో ఎప్పుడూ లీకేజీలు మరమ్మతులే. సమయపాలన అంటూ లేని నీటి సరఫరాతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. నీటి కోసం గంటల తరబడి ఎదురుచూస్తున్నా నీరు ఎప్పుడు వస్తుందో తెలియని దుస్థితి ఏర్పడింది.



మరమ్మతు పనుల్లో సిబ్బంది

శిథిలావస్థకు చేరిన పాత పైప్‌లైన్లతోపాటు నాణ్యత లేని మిషన్ భగీరథ పైప్‌లైన్లు రోజు ఎక్కడో ఓ చోట లీకేజీలకు గురవుతున్నాయి. పట్టణంలో రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం, ప్రధాన అంతర్గత రోడ్ల విస్తరణ పనులు జరుగుతుండడంతో పైపులైన్లు ధ్వంసమవు తున్నాయి. వాటిని గుర్తించి మరమ్మతు చేసే విషయంలో జాప్యం జరుగు తుంది. ఓ వైపు నిధుల సమస్య, మరో వైపు అందుబాటులో లేని వర్కర్ల కారణంగా మరమ్మతు పనులు నామమాత్రంగా జరుగుతున్నాయి. ఒకచోట మర మ్మతు పూర్తి కాగానే మరో చోట సమస్య ఏర్పడుతుంది. ఇలా పట్టణంలో రోజూ ఎక్కడో ఓ చోట పైపులైన్ల సమస్య రావడంతో మున్సిపాలిటీకి పైపులైన్ల నిర్వహణ, మంచినీటి సరఫరా భారంగా మారింది. అందుబాటులో ఉన్న సిబ్బందితో పైపులైన్ల మరమ్మతు చేయించి నీటి సరఫరా చేయడానికి మున్సిపల్ కమిషనర్, అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. కొన్ని రోజులుగా శ్రీరాంనగర్ ప్రాంత ప్రజలు, గౌడవీధి, పాత జెండా, పోచమ్మ వాడ, గడీమహల్, తదితర ప్రాంతాలలో నీటి సమస్య అధికంగా ఉంది. శ్రీరాంనగర్ ఏరియాలో ఎక్కువగా ప్రజలు నల్లా నీటి పైనే ఆధారపడ్డారు. మిషన్ భగీరథ పేరిట ఆర్అండ్‌బీ అతిథి గృహం ఆవరణలో, ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం, జిల్లా పరిషత్ బాలికల హైస్కూల్ ఆవరణలో రెండు లక్షల లీటర్ల సామర్థ్యం గల ఓవర్ హెడ్ ట్యాంకులను నిర్మించారు. కానీ వీటిని వినియోగించుకోలేకపోయారు. మేజర్ గ్రామ పంచాయతీ ప్రజల అవసరాలకు రూపొందించిన రక్షిత మంచినీటి పథకం ప్రస్తుతం పెరిగిన పట్టణ ప్రజల తాగునీటి అవసరాలను తీర్చడం లేదు. సుల్తానాబాద్ పట్టణంతోపాటు వీలీన గ్రామాలైన పూసాల, శాస్త్రినగర్, సుగ్లాంపల్లి, శ్రీరాము లపల్లి గ్రామాలున్నాయి. 15 వార్డులు ఉన్నాయి. ఈ వార్డుల్లో ఇంటింటికీ నల్లాల ద్వారా నీటి సరఫరా కోసం ప్రస్తుతం 6 ఓవర్ హెడ్ ట్యాంకులు ఉన్నాయి. నల్లాల సంఖ్య ఆరువేలకు పైగా ఉన్నాయి. కొత్తగా నిర్మించిన నాలుగైదు ట్యాంకులు నిరుపయోగంగా ఉన్నాయి. దశాబ్దాల నుంచి గట్టేపల్లి మానేరు వాగులో ఉన్న బావిలోని మోటార్లతో పైపులైన్ల ద్వారా అశోక్‌నగర్ ఎస్సారెస్పీ కాలువ పక్కన గల మంచినీటి బావిలో (సంప్) నీరు డంప్ చేస్తున్నారు. ఈ దారిలో ప్రస్తుతం చెక్‌డ్యామ్ కోసం బండ రాళ్ల వాహనాలు రాకపోకలతో పాత పైపులైన్లు దెబ్బతిని నీటి సరఫరాకు ఆటంకాలు ఎదురువుతున్నాయి.

యుద్ధప్రాతిపదికన మరమ్మతు

మహ్మద్ నియాజ్, మున్సిపల్ కమిషనర్

ఎన్నో ఏళ్ళ నాటి పైపులైన్లు కావడంతో తరుచూ పైపులైన్లు దెబ్బ తింటున్నాయి. పగిలిపోయిన, లీకేజీ అయిన వాటిని వెంటనే మరమ్మతు చేయిస్తున్నాం. మరో చోట సమస్య తలెత్తుతుంది. సమస్యను ఎమ్మెల్యే, కలెక్టర్ దృష్టికి తెచ్చాం. గట్టేపల్లి నుంచి అశోక్‌నగర్‌లోని మంచినీటి సంప్ వరకు నూతన పైపులైన్ల నిర్మాణం కోసం ఎమ్మెల్యే చర్యలు తీసుకుంటున్నారు.

పైపులైన్ల పనులు ప్రారంభిస్తాం

మున్సిపల్ ఏఈ సతీష్

తాగునీటి సమస్య ఎక్కువగా ఉంది. భారీ వాహనాల రాకపో కలు, రోడ్డు పనులు తదితర కారణాల వలన సమస్య ఏర్ప డింది. పాడైపోయిన పైపులైన్ల స్థానంలో కొత్తవి వేయడంపై కమిషనర్‌తో కలిసి ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లాం. అమృత్ స్కీంలో మంజూరైన రూ.18 కోట్లతో కొత్తగా ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణం అవుతుంది. గట్టేపల్లి నుంచి దుబ్బలపల్లి బావి వరకు పైపులైన్లు వేస్తాం.

నేటి నుంచి రామగుండం కస్తూర్బాలో వేసవి శిబిరం

పెద్దపల్లి కల్చరల్, మే 3(ఆంధ్రజ్యోతి): రామగుండం కస్తూర్బాగాంధీ విద్యాలయంలో ఆదివారం నుంచి ఈనెల 20వరకు వేసవి శిబిరం నిర్వహిస్తున్నామని జిల్లా విద్యాశాఖ అధికారి డి.మాధవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రామగుండం కస్తూర్బాగాంధీ విద్యాలయంలో 15 రోజులపాటు ఈనెల 4నుంచి 20వ తేదీ వరకు సంగీతం, నృత్యం, చిత్రలేఖనం, కంప్యూటర్ నైపుణ్యాలు అకాడమిక్ ఎన్రిచ్మెంట్ స్పోకెన్ ఇంగ్లీష్, గణితం, శారీరక అభివృద్ధి, యోగా అంశాలపై శిక్షణ ఇస్తామన్నారు. ఈ శిక్షణను విద్యార్థినులు సద్వినియోగం చేసుకోవాలని, ఈ అంశాలలో శిక్షణ ఇచ్చేందుకు ఆసక్తి ఉన్న వారికి గౌరవ వేతనం చెల్లిస్తామని, ఆసక్తి గలవారు 7661023766 నంబర్‌లో సంప్రదించాలని జిల్లా విద్యాశాఖ అధికారి ప్రకటనలో పేర్కొన్నారు.

హత్యాయత్నం కేసులో ఇద్దరు నిందితుల అరెస్టు



అరెస్టు వివరాలను వెల్లడిస్తున్న ఏసీపీ రమేష్

కోల్‌సిటీ, మే 3 (ఆంధ్రజ్యోతి): హత్యాయత్నం కేసులో ఇద్దరు నిందితులను అరెస్ట్‌చేసినట్లు ఏసీపీ ఎం రమేష్ తెలిపారు. శనివారం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో విలేకరులసమావేశంలో వివరాలను వెల్లడించారు. ప్రశాంత్ నగర్‌కు చెందిన చీమల తిరుపతి, రాగుల రాజశేఖర్, బోనగిరి రాకేష్‌లకు నేర చరిత్ర ఉందన్నారు. 2021లో ప్రశాంత్‌నగర్‌కు చెందిన బండారి మొగిలి హత్య కేసులో వీరు నిందితులు. ఈకేసు ప్రస్తుతం ట్రయల్‌కు వచ్చిందన్నారు. రాకేష్, రాజశేఖర్‌లు కేసు రాజీ చేసుకుందామని ప్రధాన నిందితుడు చీమల తిరుపతితో సంప్రదిస్తే రాజీ అవసరం లేదని, కేసు కొట్టుడు పోతుందంటూ దాట వేశాడన్నారు. ఈ విషయంలో ముగ్గురి మధ్య విభేదాలు తలెత్తాయని, మూడు రోజులుగా మాట్లాడుదామని పిలిచినా తిరుపతి స్పందించలేదని, కేసులో శిక్ష పడితే కుటుంబాలు రోడ్డున పడుతాయని ఇద్దరు నిందితులు తిరుపతికి నచ్చజెప్పినా అతను ఒప్పుకోలేదన్నారు. ఈక్రమంలో శుక్రవారం తిరుపతి నిర్వహిస్తున్న ఎస్ఎం ఆన్‌లైన్‌సెంటర్‌కు వచ్చిన నిందితులు అతనిపై కత్తులతో దాడిచేశారని తెలిపారు. నిందితులిద్దరిని గోదావరి సమీపంలోని సమ్మక్కసారలమ్మ గద్దెలవద్ద అరెస్టుచేశామని, వారినుంచి బైక్,కత్తులు స్వాధీనపర్చుకున్నామన్నారు. విలేకరుల సమావేశంలో సీఐ ఇంద్రసేనారెడ్డి, ఎస్ఐ భూమేష్, హెడ్‌కానిస్టేబుళ్ల సదానందం పాల్గొన్నారు.

పాముకాటుతో వృద్ధురాలి మృతి



రాజమ్మ(ఫైల్)

ఓదెల, మే 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన గాండ్ల రాజమ్మ(70) అనే వృద్ధురాలు పాము కాటుకు గురై మృతి చెందింది. శుక్రవారం రాత్రి ఇంటిపనులు చేస్తుండగా పాము కాటు వేయడంతో అస్వస్థతకు గురైంది. దీంతో కుటుంబ సభ్యులు సుల్తానాబాద్ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందింది. మృతురాలి కుమారుడు గాండ్ల సమ్మయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పొత్కపల్లి ఎస్ఐ రమేష్ తెలిపారు.

కానరాని పర్యాటక శోభ

- అభివృద్ధికి నోచుకోని కొండగట్టు
- ప్రతిపాదన దశలోనే నిలిచిన రోప్‌వే
- కలగానే కోతుల పార్క్

మల్యాల, మే 3 (ఆంధ్రజ్యోతి): ఎత్తైన గుట్టలు.. వందలాది ఎకరాల భూములు.. పచ్చని చెట్లు.. ఫ్రైమరిపించే అందాలు.. అన్నింటికీ మించి కోతుల కిచకిచలు.. ఇవి కొండగట్టు ఆంజనేయ స్వామి దేవస్థానం ప్రత్యేకత. కానీ పర్యాటకంగా అభివృద్ధి మాత్రం ఇక్కడ కనిపించదు. కొండగట్టు పుణ్య క్షేత్రానికి నిత్యం వేలాదిగా, హనుమాన్ జయంతి ఉత్సవాల సందర్భంగా లక్షలాదిగా భక్తులు తరలి వస్తారు. కొండగట్టు ప్రాంతం పర్యాటకంగా అన్ని విధాల ఎంతో అనుకూలం అయినప్పటికీ అభివృద్ధికి దూరంగా ఉండటం పట్ల ఈ ప్రాంతవాసులు



రోప్‌వే ప్రతిపాదిత స్థలం



కొండగట్టు అంజన్న ఆలయం

అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కొండగట్టును పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దడంపై అధికారులు, పాలకవర్గం పట్టించుకోవడం లేదని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొండగట్టును పర్యాటకంగా అభివృద్ధి పరుస్తామని హామీలు ఇచ్చిన నేతల మాటలు నీటిమూటలు అవుతున్నాయి. కొండగట్టును పర్యాటకంగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

● పదేళ్లుగా ప్రతిపాదనలకే పరిమితం

కొండగట్టులో రోప్‌వే ఏర్పాటు పదేళ్లుగా ప్రతిపాదన దశలోనే మిగిలిపోయింది. మెట్లదారి నుంచి ప్రస్తుత పుష్కరిణి వెనుక వైపు వరకు తాడు మార్గం (రోప్ వే)కు అప్పట్లో రెవెన్యూ అధికారులు స్థల పరిశీలన కూడా చేశారు. పర్యాటక శాఖ అధికారుల సైతం పలుమార్లు కొండగట్టును సందర్శించి రోప్‌వే కోసం పరిశీలన జరిపారు. రెవెన్యూ అధికారులు సుమారు 12 ఎకరాల మేర స్థలం కూడా కేటాయించారు. తదనంతరం దాని ఊసే లేకుండా పోయింది. రోప్ వే అయితే ఇక్కడ పర్యాటకంగా ఎంతో అభివృద్ధి చెందే అవకాశం ఉన్నా దానిని పట్టించుకునే వారే కరువయ్యారు.

● అమలుకు నోచుకోని హామీలు

కొండపైన కోతుల పార్క్ ఏర్పాటు చేయడం వలన వాటి సంరక్షణ, పెంపు తదితర అవకాశాలు ఉండగా అది అమలుకు ఆమడ దూరంలో ఉంది. ఆంజనేయ స్వామి ప్రతిరూపంగా కొండగట్టు దేవస్థానానికి వచ్చే భక్తులను విశేషంగా ఆకర్షించే కోతుల సంరక్షణకు ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో వీటి ఉనికి ప్రశ్నార్థంగా మారుతోంది. ఆహార అన్వేషణలో కొండ దిగి కరీంనగర్-జగిత్యాల ప్రధాన రహదారిపై సంచరిస్తున్న కోతులు తరచుగా భారీ వాహనాల కింద పడి మరణిస్తున్నాయి. కొండగట్టు దేవస్థానం పరిధిలో గల కనీసం 200 ఎకరాలు భూమి కోతుల పార్క్ కోసం అవసరముండగా ఇందుకు కావాల్సిన నివేదికను అటవీ శాఖతో పాటు జంతు ప్రదర్శన (పర్యావరణ) శాఖ అధికారులు తయారు చేయాల్సి ఉంటుంది. అయితే సమన్వయ లోపం, దేవాదాయ శాఖ, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యంతో కోతుల పార్క్ కలగానే మిగులుతోంది.



నమూనా రోప్‌వే

గుర్తుతెలియని వృద్ధుడి మృతి



మృతిచెందిన వృద్ధుడు

కరీంనగర్ క్రైం, మే 3 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గుర్తు తెలియని వృద్ధుడు(60) శుక్రవారంరాత్రి మృతి చెందాడని అవుట్‌పోస్ట్ హెడ్‌కానిస్టేబుల్ ప్రభాకర్‌తెలిపారు. కరీంనగర్ కమాన్‌వద్ద అనారోగ్యంతో రోడ్డుపక్కన పడిఉన్న వృద్ధుడిని గతనెల25న 108అంబులెన్స్ సిబ్బంది ప్రభుత్వఆసుపత్రికి తరలించారు. అప్పటినుంచి చికిత్స అందిస్తుండగా వృద్ధుడు మృతిచెందినట్లు తెలిపారు.మృతుడిని గుర్తించినవారు రెండోఠాణా, అవుట్‌పోస్టుపోలీసులను సంప్రదించాలని కోరారు. వృద్ధుడి మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీలో భద్రపరిచినట్లు తెలిపారు.

పుస్తెల తాడు ఇవ్వనందుకు భార్య హత్య

● నిందితుడి అరెస్ట్ ● వివరాలు వెల్లడించిన డీఎస్పీ

కొడిమ్యాల, మే 3 (ఆంధ్రజ్యోతి): అప్పులు తీర్చడానికి భార్య మెడలోని బంగారుపుస్తెల తాడు అడిగితే ఇవ్వలేదని కొడిమ్యాలకు చెందిన అవుదుర్తి మమతను ఆమె భర్త అవుదుర్తి మహేందర్ ఉరివేసి హత్య చేశాడని జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ తెలిపారు. శనివారం కొడిమ్యాల పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో డీఎస్పీ మాట్లాడుతూ మండల కేంద్రానికి చెందిన అవుదుర్తి మహేందర్‌కు మమతతో 20 సంవత్సరాలక్రితం వివాహం జరిగిందన్నారు. వీరిద్దరికి సంతానం లేకపోవటం, కుటుంబంలో ఆర్థిక పరమైన విషయాల్లో గొడవలు జరుగుతున్నాయన్నారు. సంతానం లేకపోవటంతో మహేందర్ తాగుడుకు బానిసై అప్పుల పాలయ్యాడన్నారు. నిందితుడు ఏ పని చేయకపోవటంతో మమత షాపింగ్‌మాల్‌లో పనిచేసేదన్నారు. భార్య ఉద్యోగం చేయగా వచ్చే డబ్బులను నిందితుడు తీసుకునేవాడని డీఎస్పీ వెల్లడించారు. కొద్దిరోజుల క్రితం బంగారు పుస్తెల తాడు ఇవ్వాలని అడుగగా మమత నిరాకరించిందన్నారు. భార్యను చంపితే పుస్తెల తాడు తీసుకోవచ్చునని పథకం వేశాడని డీఎస్పీ తెలిపారు. గత నెల 26న వేములవాడ, నల్లగొండ దైవ దర్శనాలకు వెళ్దామని నమ్మించి దర్శనాల అనంతరం మమతను మహేందర్ కొడిమ్యాలలోని ఇంటికి తీసుకువచ్చాడన్నారు. అనంతరం భార్య మెడ చుట్టు నైలాన్ తాడుతో ఉరి పెట్టి హత్య చేశాడన్నారు. ఆత్మహత్య చేసుకున్నట్లుగా నమ్మించేందుకు నైలాన్ తాడును ఇంటి స్లాబ్ హుక్‌కు కట్టాడన్నారు. అనంతరం పుస్తెల తాడు తీసుకొని గోల్డ్ లోన్ పెట్టి అప్పులను తీర్చుకున్నాడని డీఎస్పీ తెలిపారు. శనివారం మోటారు సైకిల్‌పై పారిపోతుండగా మండలంలోని చెప్యాల ఎక్స్ రోడ్డు వద్ద పట్టుకున్నామన్నారు. మృతురాలి తల్లి రాచకొండ పద్మ ఫిర్యాదు మేరకు మహేందర్‌పై హత్య కేసు, మహేందర్ కుటుంబ సభ్యులపై వరకట్నం వేధింపుల కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. నిందితుని వద్ద మోటార్‌సైకిల్, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో మల్యాల సీఐ నీలం రవి, కొడిమ్యాల ఎస్సై ఎస్. సందీప్, హెడ్ కానిస్టేబుల్ కనకయ్య ఉన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రఘుచందర్

కల్వచర్లలో మహిళ దారుణ హత్య



సమ్మక్క(ఫైల్)

రామగిరి, మే 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్వచర్ల గ్రామ పంచాయతీ పరిధిలోని కౌండిన్యనగర్‌లో శుక్రవారం అర్ధరాత్రి మోటం సమ్మక్క(30) అనే మహిళ హత్యకు గురైంది. మంచిర్యాలజిల్లా తాండూరు ఐబీకాలనీ సమీపంలో పత్తి కనకరాజు అనే వ్యక్తితో సమ్మక్క కొన్నేళ్లుగా సహజీవనం చేస్తోంది. స్క్రాప్ వ్యాపారం చేస్తున్న వీరు తాండూరులో వ్యాపారం సజావుగా కొనసాగడం లేదని రెండు రోజులక్రితం కల్వచర్లలో ఉంటున్న బంధువుల ఇంటికి వచ్చారు. వ్యాపారంలో భాగంగా శుక్రవారం మంథని, కాటారం ప్రాంతంలో పర్యటించి రాత్రి కల్వచర్లకు చేరుకున్నారు. అప్పటికే మద్యం సేవించి ఉన్న వారి మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. మద్యం మత్తులో ఆవేశంతో కనకరాజు అక్కడే ఉన్న సిమెంట్ బ్రిక్స్‌తో సమ్మక్క తలపై దాడి చేశాడు. ఈఘటనలో సమ్మక్క అక్కడిక్కడే మృతిచెందింది. అనంతరం కనకరాజు అక్కడినుంచి పరారయ్యాడు. కాగా మోటం సమ్మక్కకు గతంలో వివాహం జరగగా అనారోగ్య కారణంగా భర్త మృతి చెందాడు. మృతురాలికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. కనకరాజుకు భార్య ముగ్గురు పిల్లలు ఉన్నారు. సమ్మక్క తమ్ముడు తూర్పాటి మహేష్ ఫిర్యాదుమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చంద్రకుమార్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

మామిడిచెట్టుపై నుంచి పడి వృద్ధుడి మృతి

కోల్‌సిటీ, మే 3 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని చంద్రశేఖర్‌నగర్‌కు చెందిన నాగవెల్లి బాలయ్య(70) అనే వృద్ధుడు శనివారం ఇంటి ఆవరణలోని మామిడిచెట్టు ఎక్కి కాయలు తెంపుతుండగా జారి కింద పడ్డాడు. ఈ ఘటనలో అతని తలకు తీవ్ర గాయాలయ్యాయి. అతని పరిస్థితి విషమించడంతో కరీంనగర్ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మరణించాడు. అతని భార్య సుగుణ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు వన్‌టౌన్ ఎస్ఐ కే రమేష్ పేర్కొన్నారు.

మరణంలో కూడా ఇద్దరికి చూపునిచ్చిన మహిళ



వినోద(ఫైల్)

సైదాపూర్, మే 3 (ఆంధ్రజ్యోతి): ఓ తల్లి మృతి చెందుతూ తన నేత్రాలను దానం చేసి ఇద్దరు అంధులకు చూపునిచ్చింది. ఆ తల్లి మృతిచెందిన నేత్రాలు మాత్రం చూస్తూనే ఉంటాయి. సైదాపూర్ మండలంలోని ఆకునూర్ గ్రామానికి చెందిన మద్దూరి వినోద (65) అనారోగ్యంతో మృతిచెందగా వారి కుమారుడు రాంచంద్రారెడ్డి, కూతుళ్ల, అల్లుళ్ల రమ-సంపత్ రెడ్డి, స్వప్న-పతీష్‌రెడ్డి, కుటుంబ సభ్యులు ఆమె నేత్రాలను దానం చేశారు. దీంతో వరంగల్ ప్రాంతీయనేత్ర వైద్యశాలలోని ఎల్వీ ప్రసాద్ నేత్ర టెక్నీషియన్ లక్ష్మన్ నేత్రాలను సేకరించారు. మృతురాలు నేత్రదానంద్వారా ఇద్దరు అందులకు చూపురావడమే కాకుండా నేత్ర వైద్యవిద్యకు ఉపయోగ పడిందని తెలంగాణ నేత్ర, అవయవ, శరీరదాతల అసోసియేషన్ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్రఅసోసియేషన్ వరంగల్‌జిల్లా అధ్యక్షుడు మల్లారెడ్డి, హన్మకొండ జిల్లా ప్రధానకార్యదర్శి జనార్దన్, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

బాలుడి ప్రాణం మీదికి తెచ్చిన కోడిగుడ్డు

● ప్రాణాలు కాపాడిన 108టెక్నీషియన్



అస్వస్థతకు గురైన బాలుడితో తల్లిదండ్రులు

పాలకుర్తి, మే 3 (ఆంధ్రజ్యోతి): యేడాది వయసు ఉన్న బాలుడు.. గొంతులో కోడి గుడ్డు ఇరుక్కుపోయి ఊపిరాడక ఇబ్బంది పడ్డాడు. ప్రాణాపాయస్థితిలో కొట్టుమిట్టాడుతున్న బాలుడికి 108సిబ్బంది చికిత్సఅందించారు. వివరాలు ఇలా ఉన్నాయి. పెద్దపల్లిజిల్లా పాలకుర్తిమండలం రాణాపూర్ గ్రామానికి చెందిన రాజేష్-అశ్విని దంపతుల కుమారుడు శ్రేయాన్స్(1) వంటగదిలోని పాత్రలో ఉన్న గుడ్డును నోట్లో వేసుకున్నాడు. అదికాస్త గొంతులో ఇరుక్కుపోయి ఊపిరాడని పరిస్థితి ఏర్పడింది. దీంతో దిక్కుతోచని బాలుడి కుటుంబసభ్యులు హుటాహుటినపెద్దపల్లి ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్లారు. శ్రేయాన్స్‌ను పరీక్షించిన వైద్యులు కరీంనగర్‌తీసుకెళ్లాలని సూచించారు. 108లో కరీంనగర్‌కు తరలిస్తుండగా బాలుడి పరిస్థితి విషమంగా మారింది. మార్గమధ్యలో 108టెక్నిషియన్ భాను ప్రసాద్ బాలుడికి చౌకింగ్‌చేసి ప్రాణాపాయస్థితి నుంచి కాపాడాడు. బాలుడిని బ్యాక్‌స్లాబ్స్‌తో ఫుడ్‌పార్టికల్స్(వాంప్టింగ్)ద్వారా గుడ్డును బయటికి రప్పించడంతో తల్లిదండ్రులు ఊపిరిపీల్చుకున్నారు. తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు108టెక్నీషియన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

అక్రమంగా మట్టి రవాణా..
వాహనాలను సీజ్ చేసిన అధికారులు



పోలీస్‌స్టేషన్‌కు తరలించిన ఎక్స్‌కావేటర్

గన్నేరువరం, మే 3 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా కెనాల్ మట్టిని తరలిస్తున్న ఎక్స్‌కావేటర్, రెండు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు ఎస్ఐ తాంద్రనరేష్ తెలిపారు. మండలంలోని గునుకుల కొండాపూర్ శివారులోని మిడ్‌మానేరు వరదకెనాల్ మట్టిని గునుకుల కొండాపూర్‌కు చెందిన గూడెల్లి నరేష్, జనగామ అనిల్, బూట్ల సతీష్ అక్రమంగా తరలిస్తున్నారన్న స్థానికుల సమాచారం మేరకు శుక్రవారం రాత్రి ఆ ప్రదేశానికి వెళ్లి ఎక్స్‌కావేటర్, రెండు ట్రాక్టర్లను అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించామన్నారు. ఇరిగేషన్ ఏఈ మహేందర్ ఫిర్యాదు మేరకు వాహనాలను సీజ్ చేసి యజమానులపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు. అక్రమంగా ఎవరైనా మట్టిని తరలిస్తే స్థానికులు తమ దృష్టికి తీసుకురావాలని ఇరిగేషన్ ఏఈ మహేందర్ సూచించారు.

ఆదివాసుల హక్కులను కాలరాస్తున్న కేంద్ర ప్రభుత్వం

● ప్రభుత్వం బేషరతుగా మావోయిస్టులతో చర్చలు జరపాలి ● శాంతి చర్చల కమిటీ చైర్మన్ జస్టిస్ చంద్రకుమార్

జమ్మికుంట, మే 3 (ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతాల్లో ప్రభుత్వం ఏ పని చేపట్టాలనుకున్నా వారి నిర్ణయానికి వ్యతిరేఖంగా చేసే అధికారం లేదని శాంతిచర్చల కమిటీచైర్మన్ జస్టిస్ చంద్రకుమార్ అన్నారు. వాటిని స్వయంగా ప్రభుత్వమే ఉల్లంఘిస్తూ ఆదివాసుల హక్కులకు విఘాతం కలిగించటం ప్రజాస్వామ్యబద్దం కాదన్నారు. శనివారం జమ్మికుంట పట్టణంలోని వినాయక గార్డెన్‌లో శాంతిచర్చలను కోరుతూ మానవ హక్కుల వేదిక రాష్ట్రప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్ తిరుపతయ్య అధ్యక్షతన సదస్సు నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన విశ్రాంత హైకోర్టు న్యాయమూర్తి చంద్రకుమార్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం వెంటనే కాల్పుల విరమణ ప్రకటించి మావోయిస్టులతో శాంతిచర్చలు జరపాలన్నారు. రాజ్యాంగం ప్రజలందరికీ గౌరవప్రదమైన జీవించే హక్కును కల్పించిందన్నారు. ఇది ఆదివాసులకు, మావోయిస్టులకు, పోలీస్‌వారికి అందరికీ వర్తిస్తుందన్నారు. తాము శాంతి చర్చల కమిటీగా ఏర్పడి మావోయిస్టులకు, కేంద్ర ప్రభుత్వానికి హింసను వీడనాడాలని విజ్ఞప్తి చేశామన్నారు. మావోయిస్టులు తుపాకులు వినియోగించమని, చర్చల ద్వారా శాంతి ఏర్పడటానికి కట్టుబడి ఉన్నామని ప్రకటించారన్నారు. నెలరోజుల నుంచి వారు దానికి కట్టుబడి ఉంటే కేంద్ర ప్రభుత్వం మాత్రం వారిని చుట్టుముట్టి చంపి వేయడానికి మరిన్ని బలగాలను పంపడం ఏ రకంగాను ధర్మం కాదన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం స్పందించి వెంటనే కాల్పుల విరమణ ప్రకటించి, బేషరతుగా మావోయిస్టులతో చర్చలు జరపాలన్నారు. చర్చల సమయంలో ఏ రకమైన షరతులైనా పెట్టవచ్చని, కానీ చర్చలకు ముందు షరతులు పెట్టడం భావ్యం కాదన్నారు. కర్రె గుట్టల్లో, ఛత్తీస్‌గఢ్‌లో మోహరించిన బలగాలను.. మావోయిస్టులను చంపటానికి పంపకూడదని అన్నారు. చర్చల ప్రక్రియను ప్రారంభించాలని, అందుకోసం ప్రజలు, ప్రజాస్వామిక వాదులు తమ గొంతు విప్పాలన్నారు. అన్నిరాజకీయ పార్టీలు సైతం వాటి రాజకీయ వైఖరీకు అతీతంగా సమస్యను శాంతియుతంగా మానవీయ మార్గంలో పరిష్కరించడానికి తమవంతుగా కృషి చేయాలన్నారు.

కార్యక్రమంలో దేశిని కోటి, మొలుగూరి సదయ్య, పింగిలి రమేష్, తక్కళ్లపల్లి రాజేశ్వర్‌రావు, పోడేటి రామస్వామి, కనుమల్ల విజయ, మిలుకూరి వాసుదేవరెడ్డి, బదావత్ రాజు, టి హరికృష్ణ, పందిళ్ల రంజిత్‌కుమార్, గుంటి సామ్రాజ్యం, మోహన్, దొడ్డె సమ్మయ్య, ఆవాల నరహరి, పుల్లూరి సంపత్‌రావు, రాజకీయ పార్టీల నాయకులు, ప్రజా సంఘాల నాయకులు, ఉద్యోగులు, తదితరులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.



మాట్లాడుతున్న హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి చంద్రకుమార్

బాలభవన్ శిక్షణ తరగతులకు స్పందన



సంగీతం నేర్చుకుంటున్న విద్యార్థులు

కరీంనగర్ కల్చరల్, మే 3 (ఆంధ్రజ్యోతి) : కలెక్టర్, విద్యాశాఖ ఆధ్వర్యంలో కరీంనగర్‌లో నిర్వహిస్తున్న బాల భవన్ వేసవి శిక్షణ తరగతులకు మంచి స్పందన లభిస్తోంది. అబాకస్, శాస్త్రీయ నృత్యం, యోగా, చెస్, మృదంగం, నృత్యం, సంగీతం, మెహందీ, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్, డ్రాయింగ్ విభాగాలతో పాటు ఈ యేడు కర్రసాములోకూడా శిక్షణ ఇస్తున్నారు. జూన్ 10వ తేదీ వరకు అంశాల వారీగా శిక్షణ ప్రతీరోజూ ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కొనసాగనుంది. ఏప్రిల్ 1వ తేదీ నుంచి మే 3 వరకు నమోదై దరఖాస్తులు చేసుకున్న 617 మంది విద్యార్థులు ప్రస్తుతం వివిధ అంశాల్లో శిక్షణ పొందుతున్నారని బాలభవన్ సూపరెండెంట్ కట్ట మంజులాదేవి తెలిపారు. ఈ నెలలో వచ్చే బాల బాలికలు ఆధార్ కార్డ్, ఫోటోతో సంప్రదించాలని సూచించారు. విద్యార్థుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని తెలిపారు.



శాస్త్రీయ నృత్యం నేర్చుకుంటున్న చిన్నారులు



యోగా నేర్చుకుంటున్న విద్యార్థులు

నరసింహ నవరాత్రోత్సవాలు ప్రారంభం



స్వామి వారికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

ధర్మపురి, మే 3 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో నృసింహ నవరాత్రోత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభం అయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా ఉదయం 5-30 గంటలకు అర్చకులు మంగళవాయిద్యాలు వెంట రాగా గోదావరి నదికి బయలుదేరి వెళ్లారు. గోదావరి నదిలో పూజలు నిర్వహించిన అనంతరం అక్కడి నుంచి బిందె తీర్థం తీసుకువచ్చారు. అనంతరం ఆలయ వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం సహస్ర కలశ స్థాపన, నవగ్రహ, యోగినివాస్తు, క్షేత్ర పాలక స్థాపనలు, అర్చనాది ఆరాధన, హారతి, నిత్య హోమం, నిత్య కల్యాణం కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శనం చేసుకున్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ఈవో సంకటాల శ్రీనివాస్, టీపీసీసీ సభ్యులు, ధర్మపురి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సంగనభట్ల దినేష్, ఏఎంసీ చైర్‌పర్సన్ చిలుముల లావణ్య-లక్ష్మణ్, ధర్మకర్తలు అర్చకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



స్వామివారి దర్శనం కోసం క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు

ధూప దీప నైవేద్య పథకానికి దరఖాస్తుల ఆహ్వానం

కరీంనగర్ కల్చరల్, మే 3 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో అర్హత కలిగిన దేవాలయాలకు ధూప దీప నైవేద్య పథకం వర్తింపజేసేందుకు రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయశాఖ డైరెక్టర్ ఎస్ వెంకటరావు నోటిఫికేషన్ జారీ చేసినట్లు ఉమ్మడి జిల్లా దేవాదాయశాఖ సహాయ కమిషనర్ నాయిని సుప్రియ ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికైన ఆయా ఆలయాలకు నెలకు నాలుగు వేల రూపాయలు ధూప దీప, నైవేద్యాలకు, అర్చక గౌరవ భృతి కింద ఆరువేల రూపాయలు చెల్లిస్తారని పేర్కొన్నారు. దరఖాస్తుదారులు తమ దరఖాస్తులను పాత జిల్లా సహాయ కమిషనర్ కార్యాలయంలో మాత్రమే ఈ నెల 25వ తేదీ లోపు సమర్పించాలని, వివరాలకు, దరఖాస్తు ఫారం కోసం దేవాదాయశాఖ వెబ్‌సైట్‌లో చూడాలని సూచించారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో వినూత్న బోధన



- పిల్లల్లో నైపుణ్యాభివృద్ధే లక్ష్యం
- బొమ్మలు, ఇతర సామగ్రితో పాఠాలు

తిమ్మాపూర్, మే 3 (ఆంధ్రజ్యోతి): మొన్నటి దాకా అంగన్‌వాడీ కేంద్రాలంటే పిల్లలు, గర్భిణులు, బాలింతలకు పోషకాహారం అందించడమే. కానీ ఇప్పు డు పిల్లలకు ఆటపాటలతోపాటు చదువు నేర్పే కేంద్రాలుగా రూపుదిద్దుకుంటున్నాయి. ప్రస్తుతం రెండున్నర సంవత్సరాలు పూర్తి చేసుకున్న బాలబాలికలకు అంగన్‌వాడీల్లో ప్రవేశం కల్పిస్తున్నారు. వారికి అంకెలు, అక్షరాలు, అటపాటలతో కూడిన విద్య అందిస్తున్నారు.

● నూతన పాఠ్యాంశాలు

ప్రైవేట్ పాఠశాలల్లో విధంగా పిల్లలు ఒత్తిడికి గురికాకుండా ప్రభుత్వం స్నేహపూర్వక వాతావరణంలో చిన్నారులకు విద్యతోపాటు పోషకాహారం అందించేలా అంగన్‌వాడీ కేంద్రాలను తీర్చిదిద్దుతోంది. దీనికోసం ప్రభుత్వం పూర్వ ప్రాథమికవిద్య బలోపేతమే లక్ష్యంగా ప్రత్యేక కార్యాచరణ చేపట్టింది. పిల్లల్లో నైపుణ్యాలు పెంపొందించే విధంగా ఆటపాటలతో కూడిన బోధనను అందించేందుకు ప్రయత్నం చేస్తున్నారు. ఆంగ్లమాధ్యంలో కొత్త అంశాలు, పాఠ్యాంశాలతో ప్రియదర్శిని పుస్తకాన్ని ప్రవేశపెట్టారు. ఆటపాటలు, బొమ్మలు, ఇతర సామగ్రి ద్వారా పిల్లలో అభ్యాసంపై ఆసక్తి పెరిగే విధంగా కృషి చేస్తున్నారు. దీంతో పిల్లలకు విద్యపై ఆసక్తిని పెరగడమే కాకుండా అంగన్‌వాడీ కేంద్రాలకు స్వచ్ఛందంగా వస్తారు.

● అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ..

ఇప్పటికే అంగన్‌వాడీ టీచర్లకు ప్రీస్కూల్ విద్యలో శిక్షణ ఇచ్చారు. దీని ద్వారా వారు చిన్నారులకు నాణ్యమైన విద్యను అందించే వీలుంటుంది. శిక్షణ ద్వారా అంగన్‌వాడీలకు నూతన విద్యా



అట్టముక్కలు, పేపర్లతో తయారు చేసిన ఇల్లు, చెట్లు, పరిసరాలు, బొమ్మలు

ప్రమాణాలపై పట్టువస్తుంది. ఎందుకంటే ఉపాధ్యాయుల్లో చాలామంది పది, ఇంటర్మీడియట్ చదివిన వారే ఉండడం, వారికి ఆంగ్ల బాష మీద పట్టు లేకపోవడంతో శిక్షణ వారిక ఎంతో ఉపయోగపడుతుంది.

● ఆటపాటలతో..

మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో నెలకో అంశాన్ని తీసుకొని విద్యార్థులకు బోధిస్తున్నారు. అదికూడా పనికి రాని వస్తువులు తీసుకొని వాటితో పలురకాలుగా విద్యార్థులకు నిత్యజీవితంలో ఉపయోగపడి, చూసే వాటిని తయారు చేయడం వాటిపై అవగాహన కల్పిస్తున్నారు. పూల నుంచి వెలువడే సువాసనలు, పూల రంగులు, వాటి ఆకారం గురించి పిల్లలకు చూపిస్తు బోధిస్తున్నారు.సొంతంగా పలు రకాల పండ్లను అట్టలతో తయారు చేయడం వల్ల వారిలో పండ్ల రకాలు, వాటిలో లభించే పోషక విలువలు, వాటి రంగులు, వాటి ఆకారాలు తెలియజేస్తున్నారు. మట్టితో కూరగాయలు, పండ్లు తయారు చేయించడం వాటికి రంగుల వేయించడం చేస్తున్నారు. పాలడబ్బాలతో, పేపర్‌తో క్యాలెండర్, గడియారం తయారు చేయించడం వాటిని చూపించి వాటిపై అవగాహన కల్పిస్తున్నారు. తెలుగు, ఇంగ్లీష్ అక్షరాలను ఇసుకతో, చింత గింజలతో పేర్చడం ద్వారా అక్షరాలను చూపెడుతూ నేర్పిస్తున్నారు.పిల్లలకు వాహనాల గురించి తెలిపేందుకు ఏ వాహనం ఎలా ఉంటుందో, ఆ వాహనాం ఎలా నడుస్తుందో మట్టితో తయారు చేయిస్తూ పిల్లలకు తెలుపుతున్నారు. చిన్ననాటి నుంచే ట్రాఫిక్‌పై అవగాహన కల్పించేందుకు ప్లాస్టిక్ టీకప్పులతో ట్రాఫిక్‌లైట్లను, సిగ్నల్స్‌ను తయారు చేసి వాటిపై అవగాహన కల్పిస్తున్నారు. అట్ట ముక్కలు, పేపర్స్, దూది, మట్టి, గడ్డి, గాజు తదితర వస్తువులతో వివిధ శరీరభాగాలను తయారుచేసి పిల్లలకు అవయవాల గురించి తెలియజేస్తున్నారు. కుటుంబం అంటే ఏంటి అందులో ఉండే వ్యక్తులు అమ్మ, నాన్న, ఇల్లు, రక్త సంబంధీకులు గురించి అవగాహన కల్పిస్తున్నారు. జంతువుల బొమ్మలు తయారు చేసి వాటిపై అవగహన కల్పిస్తున్నారు.

సొంతంగా తయారు చేసిన ఉపకరణాలతో బోధిస్తున్నాం..

- శ్రీమతి, సీడీపీవో, కరీంనగర్ రూరల్..



గతానికి భిన్నంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యబోధన జరుగుతోంది. పిల్లల్లో అంగన్‌వాడీ కేంద్రాలకు రావాలనే ఆసక్తి పెరిగింది. ఆహ్లాదకరమైన వాతవరణంలో ఆడుతూ, పాడుతూ విద్యబుద్ధులు నేర్చుకుంటున్నారు. చిన్ననాటి నుంచే సమాజంపై పిల్లలకు ఒక అంచనా ఏర్పడుతోంది. అంగన్‌వాడీ టీచర్లు పిల్లలతో వస్తువులను తయారు చేయించడం వాటిపై అవగాహన కల్పించడం చేస్తున్నారు. నెలకో కొత్త అంశాన్ని పిల్లలకు నేర్పిస్తున్నారు.



వివిధ రకాల బొమ్మలు





మన ఊరు తెలియజేసే విధంగా మట్టి, వివిధ వస్తువులతో తయారు చేసిన అంశం

రాష్ట్రస్థాయి అన్నమయ్య కీర్తనల పోటీలు

-విజేతలకు బహుమతులు అందజేసిన సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి



విజేతలతలో ముఖ్య అతిథి, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి

కరీంనగర్ కల్చరల్, మే 3 (ఆంధ్రజ్యోతి): లీడ్ ఇండియా నేషనల్ క్లబ్, స్వరమాధురి సంస్థలు సంయుక్తంగా కరీంనగర్‌లోని సప్తగిరి కాలనీ కోదండరామాలయంలో శనివారం రాష్ట్రస్థాయిలో అన్నమాచార్య కీర్తనల పోటీలు నిర్వహించారు. విజేతల బహుమతి ప్రదానోత్సవానికి సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పోటీలు జరిపిన నిర్వాహకులకు, పాల్గొన్న వారికి అభినందనలు తెలిపారు. విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు ప్రదానం చేశారు. లీడ్ ఇండియా ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ బి మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ 10 జిల్లాల నుంచి 200 మంది పోటీల్లో పాల్గొన్నారని తెలిపారు. స్వరమాధురి సంస్థ అధ్యక్షుడు కేబీ శర్మ, సాహితీవేత్త డాక్టర్ గంద్ర లక్ష్మణరావు అన్నమయ్య జీవితం, సంకీర్తనల సారం అంశాలపై మాట్లాడారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతుల కింద సబ్‌జూనియర్స్ విభాగంలో నిధిచంద్రిక, భవిష, అనిరుధ్, జూనియర్స్ విభాగంలో అభిరాం, సింధుశ్రీ, సీనియర్స్ విభాగంలో భాస్వంత్‌శర్మ, సుష్మిత, జ్యోతి, సూపర్ సీనియర్ విభాగంలో సుదర్శన్, శంకర్, సుధాకర్ బహుమతులు అందుకున్నారు.

నకిలీ గల్ఫ్ ఏజెంట్‌పై కేసు నమోదు

జగిత్యాల అర్బన్, మే 3 (ఆంధ్రజ్యోతి): సారంగాపూర్ మండలం రంగపేట గ్రామానికి చెందిన దండుగుల నవీన్ అనే నకిలీ గల్ఫ్ ఏజెంట్‌పై శనివారం కేసు నమోదు చేసినట్లు సీఐ వేణుగోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం..

దండుగుల నవీన్ అనే యువకుడు జగిత్యాల పట్టణంలోని జమ్మి గద్దె ప్రాంతంలో ఎలాంటి అనుమతి లేకుండా లక్ష్మీ ట్రావెల్స్‌ను ఏర్పాటు చేశా డు. ఎలాంటి ప్రభుత్వ అనుమతి లేకుండా అమాయకులను విదేశాలకు పంపిస్తానని మోసం చేస్తున్నారని పోలీసులకు సమాచారం అందింది. దీంతో జగిత్యాల పట్టణ ఎస్‌ఐ గీత ఆధ్వర్యంలో సిబ్బంది లక్ష్మీ ట్రావెల్స్‌కు వెళ్లి తనిఖీ చేశారు. నవీన్ అనే వ్యక్తి ఎలాంటి అనుమతి లేకుండా ఒక గది అద్దెకు తీసుకుని అమాయకులను విదేశాలకు పంపిస్తానని మోసగిస్తున్నాడని విచారణలో తేలింది. దీంతో సుమోటోగా కేసు నమోదు చేసినట్లు సీఐ వేణుగోపాల్ తెలిపారు.

అంతర్జాతీయంగా పాక్ ఒంటరి

- సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ వీవీ లక్ష్మీనారాయణ

కరీంనగర్ కల్చరల్, మే 3 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయంగా పాక్ ఒంటరిగా మిగిలిందని, భారత్ స్నేహహస్తం అందిస్తుంటే పాక్ మాత్రం దుర్బుద్ధితో దాడిచేయడం గర్హనీయమని సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ వీవీ లక్ష్మీనారాయణ అన్నారు. ప్రజ్ఞాభారతి ఆధ్వర్యంలో శనివారం కరీంనగర్ బృందావన్ గార్డెన్‌లో 'పహల్గాం ఘటనా అనంతరం భారత్ వ్యూహాత్మక అడుగులు-పరిణామాలు' అనే అంశంపై ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ప్రధాన వక్తగా హాజరై మాట్లాడారు. కాశ్మీర్ భారత్‌లో ఎప్పటికీ అంతర్భాగమేనని అన్నారు. దేశానికి ఒకే రాజ్యాంగం, చట్టం ఉంటుందని దాన్ని ఎవరూ చెరిపేయలేరని అన్నారు. సుప్రీంకోర్టు కూడా ఆర్టికల్ 370 రద్దును సమర్థించిందని గుర్తుచేశారు. కాశ్మీరులో జరుగుతున్న అభివృద్ధి ని చూసి పీవోకేలోని యువత తాము భారత్ వాసులమేనని ఉద్యమాలు చేయడం, ఇటీవల పాక్‌కు అమెరికాకు సంబంధాలు చెడిపోవడం, పాక్ ఆర్థిక పరిస్థితి చిన్నాభిన్నం అవడంతో అక్కసును భారతదేశంపై చూపించడం జరిగిందని అన్నారు.





మాట్లాడుతున్న సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ, సమావేశంలో పాల్గొన్న ప్రజలు

గల్ఫ్ దేశాలు కూడా భారత్‌తో సత్సంబంధాలు నెరపడం కొందరికి మింగుడు పడటం లేదని తెలిపారు. నేడు అంతర్జాతీయంగా పాక్ ఒంటరి అయిందని అన్నారు. తాలిబన్లు, ఇరానియన్లు, ప్రపంచమంతా భారత్ వైపే ఉండటం, పాక్‌లో ఆహార కొరత, అక్కడి ప్రజల నుంచి ప్రభుత్వానికి వ్యతిరేకత రావడంతో వీటన్నిటిని డైవర్ట్ చేసేందుకు మతం ఆధారంగా ఉగ్రవాదాన్ని రెచ్చగొట్టి అమాయక ప్రజల ప్రాణాలు బలిగొన్నారని అన్నారు. ప్రధాని మోదీ విమానాశ్రయంలోనే వివిధ సైన్యాధ్యక్షులతో సమావేశం ఏర్పాటు చేసి ఒక ధైర్యాన్ని నింపడం గొప్ప విషయమని అన్నారు. పాక్‌ను అష్టదిగ్బంధనం చేయడం యుద్ధ నీతిలో ఒక భాగమని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో గాజుల రవీందర్, డాక్టర్ ఎల్ రాజభాస్కరరెడ్డి, డి నిరంజనాచారి, బీఎన్ శర్మ, సముద్రాల నాగేశ్వరరావు, మందల నగేశ్‌రెడ్డి, జె సత్యనారాయణరెడ్డి, దేశిని శ్రీనివాస్, వెచ్చ మురళి, డాక్టర్ చక్రవర్తుల రమణాచార్యులు, ఎలగందుల సత్యనారాయణ, నగరవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నవ్వు ఓ వరం..

● నేడు ప్రపంచ నవ్వుల దినోత్సవం

కరీంనగర్ కల్చరల్/సిరిసిల్ల, మే 3 (ఆంధ్రజ్యోతి) : నవ్వడం ఒక యోగం... నవ్వించడం ఒక భోగం... నవ్వకపోవడం ఒక రోగం... అంటారు పెద్దలు. ఎంతటి శత్రువునైనా నవ్వుతో పలకరిస్తే జయించవచ్చు. నవ్వు వ్యక్తి ముఖ కవళికలు, భావోద్వేగాలపై ప్రభావం చూపుతాయి. వరంలాంటి నవ్వు నిండు ముఖానికి ఎంతో అందం, ఆనందం, ఆరోగ్యాన్ని ప్రసాదిస్తుంది.నేటి యాంత్రిక జీవితంలో నిత్యం ఎంతో కొంతసేపు నవ్వితేగాని ఆయుష్షు, ఆరోగ్యం, ఆనందం, ప్రేమ, అభిమానాలు అందవు. ఈ దిశలో నవ్వు ప్రాధాన్యాన్ని తెలిపే ప్రపంచ నవ్వుల దినోత్సవాన్ని ప్రతీయేటా మే నెల మొదటి ఆదివారం జరుపుకుంటారు.



● నేపథ్యం...

ఈ దినోత్సవాన్ని మొదట్లో జనవరి రెండో ఆదివారం జరుపుకునే వారు. చాలా దేశాల్లో జనవరిలో చలి వాతావరణం ఎక్కువగా ఉండడంతో ఈ తేదీని మార్చాలని నవ్వుల ప్రియులు కోరారు. లాఫ్టర్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ఈ దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం మే నెల మొదటి ఆదివారం నిర్వహించాలని నిర్ణయించారు. స్లీవ్ విల్సన్ అనే మనస్తత్వ శాస్త్రవేత్త మొదట తన వృత్తిలో భాగంగా హాస్యానికి మానవుల మానసిక ప్రవృత్తికిగల సంబంధాల మీద పరిశోధనలు చేస్తూ వర్క్‌షాప్‌ను నిర్వహించాడు. 1997లో ఇండస్ ఫౌండేషన్ అనే భారతీయ సంస్థ టూ క్రియేట్ ఏ పాజిటివ్ వర్కింగ్ ఎన్విరాన్‌మెంట్ అనే అంశం మీద ప్రసంగించడానికి భారత్‌కు ఆహ్వానించింది. అప్పటికే ముంబాయిలో జూహు బీచ్ లాఫ్టర్స్ క్లబ్ డాక్టర్ మదన్ కతారియా నెలకొల్పాడు. ఈ క్లబ్‌ను హాస్య యోగా అని పిలిచారు. 1998 జులైలో విల్సన్‌తో కలిసి వరల్డ్ లాఫ్టర్ టూర్‌ను నిర్వహించారు. దీంతో నవ్వుల దినోత్సవానికి అంతర్జాతీయ ప్రచారం లభించింది. డెన్మార్క్ రాజధాని కోపెన్‌హాగేన్ 2000 జనవరి తొమ్మిదిన నిర్వహించారు. ఈ ఉత్సవం గిన్నిస్‌బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్‌లో నమోదైంది. దీంతో మొదట జనవరిలో నిర్వహించిన నవ్వుల దినోత్సవం 2004 నుంచి మే మొదటి ఆదివారానికి మార్చారు. నవ్వుల యోగా ఉద్యమం ప్రస్తుతం 115 కంటే ఎక్కువ దేశాల్లో నిర్వహిస్తున్నారు. ఆయా దేశాల్లో వేలాది లాఫింగ్ క్లబ్‌లను నిర్వహిస్తున్నారు.

● నవ్వుతో ప్రయోజనాలు

నవ్వు మన శరీరంలో సానుకూల రసాయనాలను విడుదల చేస్తుంది. మానసిక స్థితిని మెరుగుపరుస్తుంది. ఒత్తిడిని తగ్గిస్తుంది. సంతోషంగా ఉండేందుకు సహకరిస్తుంది. ప్రపంచ శాంతి పెంపొందించేందుకు తోడ్పడుతుంది. గాఢమైన నవ్వు లోతైన శ్వాసను ఉత్తేజపరచి ఆక్సిజన్ ప్రవాహం పెంచుతుంది. కండరాలను సడలించడానికి కారణమౌతుంది. రోగ నిరోధక శక్తి పెంచుతుంది. నిరాశా భావాల్ని ఎదుర్కోవడంలో సహకరిస్తుంది. విభిన్న సంస్కృతులు, నేపథ్యాల ప్రజలను ఏకం చేస్తుంది.

● జరుపుకునే విధానం...

ప్రజలు బహిరంగ ప్రదేశాల్లో సమావేశమై నవ్వుతూ యోగాభ్యాసం చేస్తారు. కుటుంబ సభ్యులతోపాటు బంధువులు, స్నేహితులు, సహచరులు, సన్నిహితులు, శ్రేయోభిలాషులు, ఎవరైనా వ్యక్తులు పరస్పరం కలుసుకున్నపుడు నవ్వుతూ మాట్లాడుకోవడం కూడా ఓ పద్ధతి. అందుకే నవ్వుల యోగా సెషన్‌లు, కామెడీ షోలు, నవ్వుల ఫ్లాష్ మాబ్స్, నవ్వుల నేపథ్య పార్టీలు, నవ్వుల పవాళ్ళు, నవ్వుల వర్క్‌షాప్‌లు జరుపుకుంటారు.

విద్యార్థుల జీవితాలతో ప్రభుత్వం చెలగాటం



మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మణికంఠరెడ్డి

గణేశ్‌నగర్, మే 3 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల జీవితాలతో కాంగ్రెస్ ప్రభుత్వం చెలగాటం ఆడుతోందని, డిగ్రీ పరీక్షలు వాయిదా పడుతున్నా పట్టించుకోవడం లేదని, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదలపై రేవంత్‌రెడ్డి మాటలు ఉత్తవే అని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి పేర్కొన్నారు. కరీంనగర్‌లోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అప్పులు తెచ్చి కళాశాలలు నిర్వహిస్తున్నామని ఫీజు బకాయిలు విడుదల చేసే వరకు సెమిస్టర్ పరీక్షలు నిర్వహించబోమని ప్రైవేటు కళాశాలలు ప్రకటించాయన్నారు. ఇప్పటికే యూనివర్సిటీల్లో పరీక్షలు వాయిదా పడ్డా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. పరీక్షలు సరైన సమయంలో జరగకపోతే విద్యార్థులు నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే డిగ్రీ కళాశాల యాజమాన్యాలతో చర్చలు జరిపి ఫీజు బకాయిలు విడుదల చేసి పరీక్షల నిర్వహణ జరిగేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మచ్చ రమేష్, నగర కార్యదర్శి మామిడిపల్లి హేమంత్, నగర నాయకులు సందీప్‌రెడ్డి, వినయ్, శ్రవణ్, రాజేష్, శివ తదితరులు పాల్గొన్నారు.

రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ



రాజరాజేశ్వరస్వామివారి దర్శనం కోసం క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు

వేములవాడ కల్చరల్, మే 3 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి వారి ఆలయంలో శనివారం భక్తుల రద్దీ నెలకొంది. ఇతర ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులతో ఆలయం భక్తులతో సందడిగా మారింది. భక్తులు తెల్లవారుజామున ఆయా క్యూలైన్‌ల ద్వారా ఆలయంలోకి చేరకుని పార్వతిపరమేశ్వరులను దర్శించుకున్నారు. అనంతరం సంకల్పపూజతో పాటుగా శివకల్యాణ పూజ పరివార దేవతాలయాల్లో భక్తులు ప్రత్యేకపూజలో పాల్గొన్నారు. రాజన్నకు కోడె మొక్కు చెల్లించుకున్నారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయాధికారులు, ఉద్యోగులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అంజన్న ఆలయంలో కోలాహలం..

మల్యాల, మే 3(ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధానం శనివారం భక్తులతో రద్దీగా మారింది. భక్తులు స్వామి వారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో అభిషేక పూజలు చేశారు. అనంతరం బేతాళుడు, శ్రీరాముల వారిని కూడా దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు పర్యవేక్షించారు.

అన్నదానానికి రూ. లక్ష విరాళం

కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి స్వామి వారి భక్తులు హైదరాబాద్ అల్వాల్‌కు చెందిన ఇనుకొండ చంద్రారెడ్డి కుటుంబసభ్యులు లక్ష రూపాయల విరాళం అందించారు. ఈ మేరకు అన్నదాన నిర్వహకులు రాజేందర్‌రెడ్డి, రవిందర్‌కు విరాళం సొమ్ములు అందించగా వారు రశీదు అందించారు.



కొండగట్టులో నిత్యాన్నదానానికి విరాళం అందజేస్తున్న భక్తులు

బీఆర్‌ఎస్‌లో చేరిన యువకులు

మంథని, మే 3 (ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్ పార్టీ మంథని నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు సమక్షంలో పలువురు యువకులు బీఆర్‌ఎస్ పార్టీలో శనివారం చేరారు. మల్హర్ మండలంలోని వల్లెంకుంట గ్రామానికి చెందిన అడప కిషన్, సుదాటి వెంకటేష్‌లకు పుట్ట మధు గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

చల్లపల్లిలో చేతి పంపునకు మరమ్మతు

మంథనిరూరల్, మే 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చల్లపల్లిలో కొన్ని రోజులుగా చేతి పంపు చెడి పోగా శనివారం మరమ్మతు చేశారు. ప్రభుత్వ పాఠశాల వద్ద ఉన్న చేతి పంపు చెడిపోవడంతో సింగిల్‌విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ దృష్టికి గ్రామస్థులు తీసుకుపోవడంతో ఆయన సొంత ఖర్చులతో మరమ్మతు చేయించారు. బోర్ రిపేర్ చేయించడంపై గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

మంథని, మే 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల గ్రౌండ్‌లోని వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు అధ్యక్షుడు అంకరి కుమార్ శనివారం తెలిపారు. ఈశిబిరంలో బీపీ, షుగర్, ఈసీజీ, 2డీ ఈకో పరీక్షలు జరుగుతాయని, వీటిని వాకర్స్ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఘనంగా పత్రికా స్వేచ్ఛ దినోత్సవం

కాల్వశ్రీరాంపూర్, మే 3 (ఆంధ్రజ్యోతి): దేశ భద్రతకు మీడియా ఎంతో ఉపయోగమని యూత్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సొన్నాయిటెంకం శివరామకృష్ణ అన్నారు. శనివారం పత్రికాస్వేచ్ఛ దినోత్సవం సందర్భంగా కేక్‌కట్‌చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా లేకుంటే సమాచారం తెలియక ప్రజలు ఇబ్బందులకు గురయ్యేవారన్నారు. మాజీ సర్పంచ్ మాదాసి సతీష్, జర్నలిస్టులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ భానుప్రసాద్ జన్మదిన వేడుకలు

ఎలిగేడు, మే 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌక్‌లో శనివారం ఎమ్మెల్సీ తానిపర్తి భానుప్రసాద్‌రావు జన్మదిన వేడుకలు మండల కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. కేక్‌కట్‌చేసి స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. కొక్కిరాల మహేశ్వర్‌రావు, చక్రధర్‌రావు, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి సంతోష్‌రావు, రాజనర్సు, ఐలయ్య, కొండాల్‌రెడ్డి, వేణుమాధవరావు, సాయిపవన్, పాల్గొన్నారు.

క్రీడల్లో రాణిస్తే ప్రత్యేక గుర్తింపు



క్రీడాకారులను పరిచయం చేసుకొంటున్న ఎమ్మెల్యే విజయరమణారావు

సుల్తానాబాద్, మే 3 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో శారీరక అభివృద్ధితోపాటు, మానసిక ప్రశాంతత, సమాజంలో ప్రత్యేక గుర్తింపు లభిస్తుందని ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు అన్నారు. జిల్లా క్రీడా శాఖ ఆధ్వర్యంలో సుల్తానాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఏర్పాటుచేసిన వేసవి ఖోఖో, వాలీబాల్ శిక్షణ శిబిరాలను ఎమ్మెల్యే శనివారం ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో క్రీడలకు పెద్దపీట వేస్తున్నామన్నారు. సీఎం కప్ పేరిట రాష్ట్ర వ్యాప్తంగా పోటీలను నిర్వహించి యువతను ప్రోత్సహించామన్నారు. వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను విద్యార్థులు ఉపయోగించుకొని క్రీడల్లో రాణించాలన్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించిన క్రీడాకారులు ఇక్కడ ఉన్నారని, వారిని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్, ఏఎంసీ చైర్మన్ మినుపాల ప్రకాష్ రావు, నాయకులు గాజుల రాజమల్లు, సాయిరి మహేందర్, ముత్యాల రవీందర్, చిలుక సతీష్, వేగోళం అబ్బయ్య గౌడ్, తిరుపతి, రాజయ్య, రాజలింగం, ఖోఖో కోచ్ గెల్లు మధుకర్ యాదవ్, వాలీబాల్ కోచ్ ప్రవీణ్ తదితరులున్నారు.

విద్యుత్ భద్రత వారోత్సవాలను విజయవంతం చేయాలి



రాఘవపూర్‌లో వారోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అధికారులు

పెద్దపల్లి రూరల్, మే 3 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ భద్రతా వారోత్సవాలను విజయవంతం చేయాలని ఎస్‌పిడిసిఎల్ ఎస్‌ఈ మాధవరావు అన్నారు. శనివారం మండలంలోని రాఘవపూర్ విద్యుత్ సబ్‌స్టేషన్‌లోని విద్యుత్ శాఖ కార్యాలయాల సముదాయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఎస్ఈ మాట్లాడుతూ ఈనెల 7వ తేదీ వరకు నిర్వహించే వారోత్సవాల్లో భాగంగా విద్యుత్ వినియోగంలో జాగ్రత్తలు తీసుకుంటూనే ఆధునిక మెళకువలను పాటిస్తూ విద్యుత్ ప్రమాద రహిత జిల్లాగా కృషి చేయాలన్నారు. పలు మండలాల విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన అధికారులు

కాల్వశ్రీరాంపూర్, మే 3 ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సివిల్ సప్లై అధికారులు జి.రవీందర్‌రెడ్డి, మహేష్‌లు అన్నారు. శనివారం మండలంలోని పెగడపల్లి, కాల్వశ్రీరాంపూర్, మొట్లపల్లి గ్రామాల్లోని వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. అనంతరం మిల్లులకు తరలించిన ధాన్యం వివరాలను అడిగి తెలుసుకొని రసీదులు పరిశీలించారు. రాబోయే రోజులలో వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున కొనుగోలు కేంద్రాలలో నిల్వ ఉన్న ధాన్యాన్ని త్వరితగతిన కాంటాలు వేసి మిల్లులకు తరలించాలని నిర్వాహకులకు సూచించారు.

దేశాభివృద్ధిలో అందరూ పాలు పంచుకోవాలి

కళ్యాణ్‌నగర్, మే 3(ఆంధ్రజ్యోతి): దేశాభివృద్ధిలో యువత పాలు పంచుకోవాలని బీజేపీ రామగుండం ఇన్‌చార్జి కందుల సంధ్యారాణి పిలుపునిచ్చారు. శనివారం రాత్రి మార్కండేయకాలనీలో కళ్యాణ్ ఆధ్వర్యంలో యువతీ యువకులు పార్టీలో చేరగా వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మూడవ సారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన నరేంద్ర మోదీ దేశంలో అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతున్నారని, ఈ సంక్షేమ పథకాలకు ఆకర్శితులై యువతీయువకులు బీజేపీలో చేరుతన్నారని, బీజేపీ నిత్యం ప్రజల సంక్షేమం కోసం పాటు పడుతుందని ఆమె అన్నారు. బీజేపీ నాయకులు కోడూరి రమేష్, బాలు, ప్రవీణ్, పద్మ, అపర్ణ పాల్గొన్నారు.

నిత్యావసర వస్తువులు పంపిణీ

రామగిరి, మే 3(ఆంధ్రజ్యోతి): కల్వచర్ల గ్రామంలోని నిరుపేద కుటుంబానికి లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో కోరండ్ల లింగారెడ్డి దంపతుల వివాహ మహోత్సవాన్ని పురస్కరించుకొని నెలకు సరిపడా నిత్యావసర వస్తువులను అందజేశారు. లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు మోల్మూమూరి శ్రీనివాస్, మాజీ జెడ్‌పీటీసీ గంట వెంకటరమణరెడ్డి, మాజీ ఎంపీటీసీ కొట్టే సందీప్, మాజీ ఉపసర్పంచ్ వేము కనకయ్య, మహేష్, కొట్టే స్వామి, కందిమహేష్ పాల్గొన్నారు.

దళితులను కించపరిస్తే కేసులు పెట్టవద్దా



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

కళ్యాణ్‌నగర్, మే 3(ఆంధ్రజ్యోతి): దళితులను కించపరిచే విధంగా మాట్లాడితే కేసులు పెట్టవద్దా అని మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్‌ను కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి ఉరిమెట్ల రాజలింగం, ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు పెండ్యాల మహేష్ ప్రశ్నించారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అంతర్గాం తహసీల్దార్ మాజీ ఎంపీపీ భార్యను కించపరిచే విధంగా మాట్లాడడాన్ని మాజీ ఎమ్మెల్యే సమర్థిస్తున్నారా అన్నారు. చందర్ ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో రామగుండం తహసీల్దార్‌గా ఉన్న రవీందర్‌ను నెల తిరగకముందు ఏ కారణం చేత బదిలీ చేయించారో చెప్పాలని వారు ప్రశ్నించారు. అడ్డగుంటలోని ఫంక్షన్‌హాల్ కూల్చివేసినప్పుడు మాజీ ఎమ్మెల్యేలు పుట్ట మధు, చందర్ బెదిరించింది ప్రజలకు తెలుసన్నారు. నయీం అనుచరుడు పాశం శ్రీనివాస్‌కు ఇక్కడ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స చేయించింది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. డీఎంహెచ్ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో ఆనంద్ అనే వ్యక్తి కాలర్ పట్టుకుని లాక్కువెళ్లడం దళితులను కించపరిచినట్లు కాదా అని, వాస్తవాలు తెలియకుండా చందర్ మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. మడ్డి తిరుపతి, నాగరాజు, స్వామి, సంతోష్, దుర్గా ప్రసాద్, అక్షయ్, రాములు పాల్గొన్నారు.

కూనారం వ్యవసాయ శాస్త్రవేత్త సిద్ధి శ్రీధర్‌కు సన్మానం



శాస్త్రవేత్తను సన్మానిస్తున్న మాజీ ఎంపీపీ సారయ్యగౌడ్

కాల్వశ్రీరాంపూర్, మే 3 ఆంధ్రజ్యోతి): కూనారం వ్యవసాయ పరిశోధన కేంద్రంలో శాస్త్రవేత్తగా పని చేస్తున్న సిద్ధి శ్రీధర్‌ను శనివారం మాజీ ఎంపీపీ గోపగోని సారయ్యగౌడ్, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ రామిడి తిరుపతిరెడ్డి, మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భగా సారయ్యగౌడ్ మాట్లాడుతూ కొన్ని ఏళ్లగా వ్యవసాయ పరిశోధన స్థానంలో శాస్త్రవేత్తగా పనిచేస్తూ ఎన్నో కొత్త వరివంగడాలను పరిశోధన చేసి ఈరాష్ట్రంతో పాటు పక్కరాష్ట్రాలకు వరి వంగడాలను ఇస్తున్నారన్నారు. వరి వంగడాలు అత్యధిక ధాన్యం దిగుబడి రావడంపై శాస్త్రవేత్త సిద్ధి శ్రీధర్‌ను ప్రత్యేకంగా అభినందించారు.

ఏవో నాగార్జున, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గాజనవేన సదయ్య, డైరెక్టర్లు ఎనగంటి రవి, ధ్యాగేటి రామచంద్రం, మాజీ సర్పంచ్ మాదాసు సతీష్, కొత్తూరు మొండయ్య, గాజుల మోహన్, సునీల్‌రావు, రానవేన క్రాంతి, రైతులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అన్నమాచార్య సంకీర్తన పోటీలో ప్రతిభ



బహుమతిని అందుకుంటున్న అభిరామ్

ఎలిగేడు, మే 3 (ఆంధ్రజ్యోతి): సుల్తాన్‌పూర్ గ్రామానికి చెందిన అక్కినపల్లి అభిరామ్‌కు రాష్ట్రస్థాయి అన్నమయ్య సంకీర్తన పోటీలో ప్రథమ బహుమతి పొందాడు. శనివారం కరీంనగర్ సప్తగిరి కాలనీలోని కోదండ రామాలయంలో జరిగిన పోటీలో జూనియర్ విభాగంలో మొదటి బహుమతి సాధించి సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి చేతుల మీదుగా బహుమతి అందుకున్నాడు. లీడ్ ఇండియా నేషనల్ క్లబ్ అధ్యక్షుడు బుర్ర మధుసూదన్‌రెడ్డి, స్వరమాధురి అధ్యక్షుడు కేబీ.శర్మ, అనంతచారి, రమేష్‌రెడ్డి, డాక్టర్ శ్రీలత, భరోసా స్వచ్ఛందసంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు అక్కినపల్లి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వేసవి శిబిరాలకు స్పందన

ముత్తారం, మే 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని 14 గ్రామ పంచాయితీ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఏర్పాటు చేసిన వేసవి శిబిరాలకు అనూహ్య స్పందన లభించింది. స్వచ్ఛందంగా విద్యార్థులను తల్లిదండ్రులు వేసవి శిబిరాలకు పంపిస్తున్నారు. వలంటీర్ల ద్వారా నడిపిస్తున్న శిబిరాలలో విద్యార్థులకు గణితం, సైన్స్ సాంఘిక శాస్త్రాల పై అవగాహన కల్పిస్తున్నారు.

మోడల్ స్కూల్‌లో ఇంటర్ ప్రవేశాలు

కాల్వశ్రీరాంపూర్/ముత్తారం, మే 3 (ఆంధ్రజ్యోతి): మల్యాల, దరియాపూర్ మోడల్ స్కూల్‌లో జూనియర్ కాలేజీలో ఇంటర్ మొదటి సంవత్సర ప్రవేశాలకు ఈనెల 5వ తేదీనుండి 20వ తేదీవరకు దరఖాస్తులు తీసుకుంటున్నట్లు ప్రిన్సిపాల్ అనుముల పోచయ్య, సంతోష్ తెలిపారు. పదో తరగతి పాసైన విద్యార్థులు ఆన్‌లైన్‌లో అప్లై చేసుకోవచ్చని, ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీలో ప్రతి గ్రూపులో గల 40సీట్లకు ఉంటాయన్నారు.

క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయి



బహుమతులు ప్రదానోత్సవంలో మాట్లాడుతున్న ఎస్ఐ ఆర్ స్వామి

పాలకుర్తి,మే 3(ఆంధ్రజ్యోతి): క్రీడలు శారీరక దృఢత్వంతోపాటు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని బసంత్‌నగర్ ఎస్ఐ ఆర్ స్వామి అన్నారు. శనివారం మండలం పరిధిలోని బసంత్‌నగర్ వర్కర్స్ క్లబ్ మైదానంలో 10 రోజుల నుంచి జరుగుతున్న రాజన్న క్రికెట్ ప్రీమియర్ లీగ్ పోటీల విజేతలకు బహుమతుల ప్రదానోత్సవంలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే మక్కాన్ సింగ్, మక్కాన్ సింగ్ సేవ సమితి చైర్‌పర్సన్ మనాలి ఠాకూర్ లు గ్రామీణ ప్రాంత క్రీడాకారుల్లో ఉన్న ప్రతిభను వెలికి తీయడానికి పోటీలు ఏర్పాటు చేయడం సంతోషమన్నారు. మాజీ ఎంపీపీ గంగాధరి రమేష్ గౌడ్, కన్నాల ప్యాక్స్ చైర్మెన్ బయ్యపు మనోహర్‌రెడ్డి,బసంత్‌నగర్ మాజీ సర్పంచ్ పర్శవేణి శ్రీనివాస్, మాజీ ఎంపీటిసి భాగ్యలక్ష్మి రవిందర్, శ్రీనివాస్, పోతుల ప్రసాద్, సతీష్ పాల్గోన్నారు.

క్రీడాకారులను ప్రోత్సహించేందుకే సమ్మర్ క్యాంపులు

- జిల్లా యువజన క్రీడాభివృద్ధి అధికారి సురేష్

సుల్తానాబాద్, మే 3 (ఆంధ్రజ్యోతి): క్రీడాకారులను ప్రోత్సహించేందుకు గాను జిల్లా వ్యాప్తంగా వేసవి కాలంలో సమ్మర్ క్యాంపులు ఏర్పాటు చేస్తున్నామని వీటిని సద్వినియోగం చేసుకుని తమ క్రీడా ప్రతిభను పెంపొందించుకోవాలని జిల్లా యువజన క్రీడల అభివృద్ధి అధికారి సురేష్ అన్నారు. సుల్తానాబాద్ మండలం గర్రెపల్లి జడ్పీ హైస్కూల్ ఆవరణలో నిర్వహిస్తున్న వాలీబాల్ సమ్మర్ కోచింగ్ శిబిరాన్ని ఆయన శనివారం సందర్శించారు. క్రీడాకారులకు ఇస్తున్న శిక్షణను పరిశీలించారు. అనంతరం సురేష్ మాట్లాడుతు జిల్లా వ్యాప్తంగా ఎంపిక చేసిన ప్రభుత్వ పాఠశాలలతో పాటు పలు ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానాలలో వేసవి కాలం క్రీడల శిక్షణ శిబిరాలను ఏర్పాటు చేశామన్నారు. ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ తదితర క్రీడలలో శిక్షణ ఇస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కోచ్ నవీన్ తో పాటు సీనియర్ వాలీబాల్ క్రీడాకారులు పాల్గొన్నారు



ఐఎన్‌టీయుసీ ఆవిర్భావ వేడుక



మాట్లాడుతున్న ఆర్జీ-3 ఉపాధ్యక్షుడు కొటరవీందరెడ్డి

రామగిరి, మే 3(ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ ఆర్జీ-3,ఏపిఏ డివిజన్‌లలో ఐఎన్‌టీయుసీ ఆవిర్భావ వేడుకను శనివారం ఘనంగా నిర్వహించారు. ఆర్జీ-3 ఉపాధ్యక్షుడు కొటరవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో గనులు, డిపార్టమెంట్, ప్రాజెక్టులపై ఐఎన్‌టీయుసీ జెండాలను ఆవిష్కరించి స్వీట్లు పంపిణీ చేశారు. వేర్వురుగా జరిగిన కార్యక్రమాల్లో ఐఎన్‌టీయుసీ ఫీట్ సెక్రటరీలు, ఫైన్ కమిటీలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

గోదావరిఖని, మే 3(ఆంధ్రజ్యోతి): సింగరేణి ఆర్జీ-2లో ఐఎన్‌టీయూసీ ఆవిర్భావ వేడుకలు నిర్వహించారు. ఏరియాలోని పలు సెక్షన్ల వద్ద జెండాలను ఎగురవేసి స్వీట్లు పంపిణీ చేశారు. వైస్‌ప్రెసిడెంట్ శంకర్‌నాయక్ మాట్లాడుతూ దేశంలోనే అత్యధిక సభ్యత్వం కలిగిన యూనియన్ ఐఎన్‌టీయూసీ మాత్రమేనని పేర్కొన్నారు. కార్మిక వర్గ హక్కుల కోసం నిర్విరామంగా కృషి చేస్తున్న సంఘం ఐఎన్‌టీయూసీ అని తెలిపారు. కొత్త సత్యనారాయణరెడ్డి, సంపత్‌రెడ్డి, నారగోని దశరథంగౌడ్, సంపత్‌రెడ్డి, సాలిగామ మల్లేష్, రవీందర్, శ్రీనివాస్, సురేష్, శ్రీధర్, తిరుపతి, మేకల శ్రీనివాస్, సమ్మయ్య, రవీందర్, అవినాష్ పాల్గొన్నారు.

క్లర్క్ పరీక్షను నిర్వహించి ఖాళీలను భర్తీ చేయాలి

గోదావరిఖని, మే 3(ఆంధ్రజ్యోతి): జూనియర్ అసిస్టెంట్ క్లరికల్ గ్రేడ్ పరీక్ష యేడాదిగా వాయిదాపడుతూ వస్తుందని, సింగరేణి యాజమాన్యం వెంటనే క్లర్క్ పరీక్షను నిర్వహించి ఖాళీలను భర్తీ చేయాలని ఆర్జీ-2 ఏఐటీయూసీ బ్రాంచి సెక్రటరీ జిగురు రవీందర్ విజ్ఞప్తి చేశారు. శనివారం కాలనీలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే డిపార్ట్‌మెంట్‌లో క్లర్కుల కొరత ఉందని, చాలా మంది క్లర్క్‌లు మెడికల్ బోర్డు ద్వారా ఉద్యోగ విరమణ పొందారన్నారు. ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న క్లర్కులు అధిక పనిభారంతో కష్టాలు ఎదుర్కొంటున్నారన్నారు. అలాగే కార్మికులకు సంబంధించిన ప్రమోషన్‌లు, వారసత్వ ఉద్యోగాలు, టెర్మినల్ బెనిఫిట్స్ చెల్లింపులు ఆలస్యం కావడం వలన కార్మికులు ఆర్థికంగా నష్టపోవడం జరుగుతున్నదన్నారు. క్లర్క్‌ల స్థానంలో జనరల్ అసిస్టెంట్‌లను వాడుతూ వారికి ఏవిధమైన యాక్టింగ్ ఇవ్వకపోవడం వల్ల వారు కూడా ఆర్థికంగా నష్టపోవడం జరుగుతూ ఏవిధమైన ప్రమోషన్స్ లేకుండా కూడా నష్టపోతున్నారన్నారు. వెంటనే క్లర్క్ పరీక్ష నిర్వహించి ఖాళీలనుభర్తీ చేసి సంస్థ అభివృద్ధికి పాటుపడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్.ప్రకాష్, అన్నారావు, బి.శ్యాంసన్, సాంబశివరావు, రవికుమార్, సంపత్, మహేందర్, రాజ్‌కుమార్, రవీందర్ పాల్గొన్నారు.

రైతు ముంగిటకు శాస్త్రవేత్తలు

(1వ పేజీ తరువాయి)

జిల్లాలోని కాల్వశ్రీరాంపూర్ మండలం గంగారం, తారుపల్లి, ముత్తారం మండలం ముత్తారం, ఓదెల మండలం జీలకుంట, పెద్దపల్లి మండలం రాంపెల్లి, హన్మంతునిపేట గ్రామాల్లో కూనారం వ్యవసాయ పరి శోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సిద్ధి శ్రీధర్ ఆధ్వర్యంలో శాస్త్రవేత్తల బృందం ఎంపిక చేసుకుని అవగాహన కల్పించనున్నారు. ఈ బృందంలో ఇద్దరు శాస్త్రవేత్తలు, ఇద్దరు బీఎస్సీ లేదా పాలిటెక్నిక్ డిప్లొమా విద్యార్థులు, వ్యవసాయశాఖ అధికారులు ఉండనున్నారు. ఆయా గ్రామాల్లోని రైతువేదికలు, పంచాయతీ కార్యాల యాల వద్ద రైతులకు అవగాహన కల్పించేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు.

ఆదివరాహస్వామి ఆలయంలో పూజలు

గోదావరిఖని, మే 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఆది వరాహస్వామి ఆలయంలో శనివారం లయన్స్ క్లబ్ గవర్నర్ నడిపెల్లి వెంకటేశ్వర్‌రావు స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు అభిషేకం అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ సిబ్బంది ఆయనను సన్మానించారు. లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు సానరామకృష్ణా రెడ్డి, ప్రధాన కార్యదర్శి నల్లవెల్లిశంకర్ తదితరులున్నారు. అలాగే తిమ్మాపూర్ మండలం వెన్నంపల్లి గ్రామానికి చెందిన గడ్డం అనంతరెడ్డి, గడ్డం దేవేంద్ర, అశోక్, శృతిలు హన్మాన్ భక్తులకు అన్నప్రసాదం నిర్వహించారు. ముందుగా స్వామి వారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. పిన్‌రెడ్డి కిషన్‌రెడ్డి, చింతపండు మధు, బుర్రరాజు, దేవునూరి చంద్రమౌళి, కొమురయ్య పాల్గొన్నారు.

కార్మికుడి కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలి



డీపీవోకు వినతిపత్రం అందిస్తున్న సీఐటీయూ నాయకులు

పెద్దపల్లి రూరల్, మే 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సబ్బితం పంచాయతీ కార్మికుడు ఏడెళ్ల నర్సయ్య పనులు ముగించుకొని ఇంటికి వెళ్తుండగా లారీ ఢీకొని మృతిచెందాడు. ఆయన కుటుంబానికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ సిఐటియూ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సీపెల్లి రవిందర్ డిమాండ్ చేశారు. శనివారం జిల్లా పంచాయతీ అధికారి వీరబుచ్చయ్య ఎంపీడీవో కార్యాలయాల్లో వినతిపత్రం అందించారు. రవిందర్ మాట్లాడుతూ నర్సయ్య మృతి వారి కుటుంబానికి తీరని లోటన్నారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం నుంచి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఎండి.ఖాజా, ఎండి.ముస్తాఫా, తిరుపతి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ

ఓదెల, మే 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హరిపురంలో శనివారం మాజీ ఉపసర్పంచ్ గ్యారవేని నాగరాజు ఆధ్వర్యంలో ఉపాధి కూలీలకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. తీవ్రమైన ఎండలో పనులు నిర్వహిస్తున్న కూలీలకు ఉపశమనంగా వందమంది కూలీలకు రెండు వందల మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. అలాగే ఉపాధి పనులు నిర్వహిస్తున్న సందర్భంగా గ్రామాలలోని కూలీలకు నీడను ఏర్పాటు చేయాలని కోరారు. ఫీల్డ్ అసిస్టెంట్ మారబోయిన పర్వతాలు, తుమ్మల లక్ష్మయ్య, దాసరి మహేందర్, అనిల్, గోపాలకృష్ణ, కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

మదర్‌థెరిస్సా ఇంజనీరింగ్ కళాశాలలో క్యాంపస్ ప్లేస్‌మెంట్

పెద్దపల్లి రూరల్, మే 3 (ఆంధ్రజ్యోతి): పెద్దబొంకూరులోని మదర్ థెరిస్సా ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులకు శనివారం క్యాంపస్ ప్లేస్‌మెంట్ నిర్వహించారు. అక్రూంట్ ఐటి సొల్యూషన్స్ సెలెక్షన్స్‌ను నిర్వహించారు. ఇంజనీరింగ్ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు సుమారు 150 మంది హాజరయ్యారు. అందులో 45 మంది రాత పరీక్షలో ఎంపికైనట్లు కళాశాల చైర్మన్ ఎడవెల్లి నవీన్ తెలిపారు. ఎంపికైన వారికి సోమవారం టెక్నికల్ రౌండ్ నిర్వహించి ఎంపిక చేస్తామని కంపెనీ వారు పేర్కొన్నారు. అనంతరం కళాశాల చైర్మన్ నవీన్ మాట్లాడుతూ కళాశాలలో అత్యాధునిక ప్రయోగశాలలు, మౌలిక సౌకర్యాలు ఉద్యోగ సాధనలో ఎంతగానో ఉపయోగపడుతున్నాయని పేర్కొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ టి.శ్రీనివాస్, అకౌంట్స్ ఆఫీసర్ పి.పవన్ కుమార్, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ కె.వెంకటేశ్వర్లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జేఎన్టీయూలో ఎప్‌సెట్



విద్యార్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది

రామగిరి, మే 3(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఎప్‌సెట్‌లో భాగంగా రెండు రోజులుగా మంథని జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన ఇంజనీరింగ్ విభాగ పరీక్షలు శనివారం ముగిసాయి. ఉదయం జరిగిన పరీక్షలో 100 మంది విద్యార్థులకు అందరూ హాజరయ్యారు. సాయంత్రం 100 మంది విద్యార్థులకు 96 మంది హాజరైనట్లు ప్రిన్సిపాల్ విష్ణువర్ధన్ తెలిపారు. పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

కృత్రిమ మేధతో ఆవుల ఆరోగ్య పరిరక్షణకు కృషి

పెద్దపల్లిటౌన్, మే 3 (ఆంధ్రజ్యోతి): కృత్రిమ మేధా సాంకేతికతను వినియోగిస్తూ ఆవుల ఆరోగ్య పరిరక్షణకు కృషి చేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో కృత్రిమ మేధ వినియోగిస్తూ ఆవుల ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యల పై కలెక్టర్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆవుల ఆరోగ్య పరిరక్షణ అంశం పై తీసుకునే చర్యల గురించి నీర్ ఇంటరాక్టివ్ సంస్థ ప్రతినిధులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కలెక్టర్ కు వివరించారు. కమాన్‌పూర్, రామగిరి, మంథని, ముత్తారం మండలాల్లో ఉన్న ఆవుల ఆరోగ్య పరిరక్షణకు ప్రయోగాత్మకంగా కృత్రిమ మేధను వినియోగించుకోవాలన్నారు. మండలాల్లో ఉన్న ఆవుల వివరాలు, వాటి యాజమాన్య రైతుల వివరాలు సేకరించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఆవులకు వచ్చే గాలికుంట, లంగ్ ఇన్ఫెక్షన్‌లను గుర్తించి అవసరమైన చికిత్స అందజేస్తారని పేర్కొన్నారు. జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి శంకర్,నీరు ఇంటరాక్టివ్ సంస్థ సీఈఓ జయశంకర్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఏఐవైఎఫ్ ఆవిర్భావ వేడుకలు

కళ్యాణ్‌నగర్, మే 3(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువత కోసం ఏఐవైఎఫ్ కృషి చేస్తుందని సీపీఐ నగర కార్యదర్శి కే కనకరాజు, శనిగరపు చంద్రశేఖర్ అన్నారు. ఏఐవైఎఫ్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శనివారం భాస్కర్‌రావు భవన్‌లో నిర్వహించిన కార్యక్రమానికి వారు ముఖ్య అతిథిగా హాజరై జెండావిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు నిరుద్యోగ భృతి ఇవ్వాలని, యువతకు 21 సంవత్సరాలకు ఓటు హక్కు కల్పించాలని పోరాటం చేశామన్నారు. కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బీజేపీ ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి ఇప్పటి వరకు ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేదని, యువతను నిర్వీర్యం చేసే ప్రభుత్వాలకు గుణపాఠం చెప్పాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు గౌతం గోవర్ధన్, రేణికుంట్ల ప్రీతం, శివ, నవీన్, సాగర్, తిరుమల, కనకరాజు, జగన్, మల్లేష్ పాల్గొన్నారు.